AL - HILAL

నెలవంక

హిజ్రీ శకం 1432 - జుల్ హిజ్జా

Vol 8, Issue: 61 NOVEMBER - 2011

مجلة الهلال (باللغة التلغوية) – ملحق مجلة البشرى

జానిస సంకెళ్ళు త్రెంచుకున్న శుభ వేళ

స్వార్థం కోసం అర్థం లేని అనర్థదాయకమైన వ్యర్థ కుల, మత, వర్ణ, వర్గ విభేదాలను అడ్డుపెట్టుకొని రక్త దాహానికి ఒడిగట్టడం దురదృష్టకరం. మనుషులంతా జన్మతః ఒక్కటే. కులం లేదు. వర్ణం లేదు. సత్యానికి, న్యాయానికి, మానవత్వానికి అంకితం కావాలి మనం.

IPC
الجالية التعريفي بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

telgo NOVEMBER.indd 1 10/20/11 4:01 PM



కీర్తికి కోలమానం

"ఓ ప్రజలారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుడు మరియు ఒకే స్త్రీ ద్వారా సృష్టించాము. మరి మీ (పరస్పర) పరిచయం కోసం మిమ్మల్ని వివిధ వర్గాలుగా, తెగలుగా చేశాము. యదార్థానికి మీలో అందరికన్నా ఎక్కువ భయభక్తులు గలవాడే అల్లాహ్ సమక్షంలో ఎక్కువగా ఆదరణీయుడు. నిశ్చయంగా అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, అప్రమత్తుడు".
(దివ్యఖుర్‌ఆన్- 49: 13)

telgo NOVEMBER.indd 2 10/20/11 4:01 PM

సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

NIDAVANKA

నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 8, ISSUE: 61
NOVEMBER 2011

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. Abdus Salam Omeri
Sk. MOHAMMED SALEEM JAMAEE
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONE
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY

IPC

Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

DESIGN
Nader Belal

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency

www.zukhruf.net
Tel. 99993072

ఈ సంచికలో....




భక్తీభావ తరంగాలు



నబీ(స) వారు నవ్విన వేళ!



ప్రవక్త (స) వారి ప్రవచనాల నీడలో



భక్తీభావ తరంగాలు	2
నేడే...ఈనాడే...	3
కీర్తిశేషుల దృష్టిలో కులం	4
పరలోక ప్రయాణం	6
మహిమాన్విత నగరం మక్కా పురం	8
నబీవారు నవ్విన వేళ!	10
ఇస్లాం శిక్షణ	12
ప్రవక్త (స) వారి ప్రవచనాల నీడలో	13
పూ పరిమళం	14
ఐపిసి వార్తలు	16
ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)	18
ధర్మ సందేహాలు	20

الجانب الروحاني في الحج - كأن اليوم آخر يوم في حياتك - نظام الطبقات في نظر مفكري الهند - مراحل الآخرة - مواقف ضحك فيها النبي صلي الله عليه وسلم - خذ عقيدتك من الكتاب والسنة (تربية المهتدين) - في ظل مواعظ الرسول صلي الله عليه وسلم (مقالة المهتدي) - جوامع الكلم - أخبار اللجنة - نصائح من سيرة سيدنا إبراهيم عليه السلام - الفتاوى الشرعية عن الحج (لفضيلة الشيخ محمد ابن صالح العثيمين)

భక్తిభావ తరంగాలు

హాజీలు **'బిస్మిల్లాహి వస్సలాతు వస్సలాము అలా రసూలిల్లాహి అల్లాహుమ్మఫ్తహ్లీ అబ్వాబ రహ్మతిక్'** అంటూ మస్జిదె హరామ్‌లో ప్రవేశించారు. అలా ప్రవేశించిన వారు వింత, వినూత్న అనుభూతికి లోనయ్యారు. దేహపరంగా వారు మౌనమూర్తులయి ఉన్నారుగానీ, వారి ఆత్మలు అనంతానంత ఆనందాన్ని అనుభవిస్తున్నాయి. వారిలోని భక్తీభావాలు సాగర తరంగాల్లా ఉవ్వెత్తు ఎగిసి పడుతున్నాయి. ప్రభాత కాలం.. భక్తీ పారవశ్యాల సంరంభం.. ఖుర్‌ఆన్ శ్రావ్య శ్రవణం.. సుభక్తాగ్రేసరుల, సత్యప్రియుల, శాంతి కాముకుల కోలాహలం!!

అహో! పవిత్ర ప్రతిష్ఠాలయం కాబా గృహ ముద్ద మనోహర దృశ్యం. వినిర్మల ప్రాంగణం మస్జిదె హరామ్. అ దివ్య ఆవరణంలో కాలు మోపగానే 1 లక్ష 24 వేల పగ్గాలతో లాగుతున్నట్లుంది. **'ఫజ్‌అల్ అఫ్‌యిదతమ్ మినన్నాసి తహ్వీ ఇలైహిమ్'** అన్న ప్రవక్తల పితామహులు ఇబ్రాహీమ్ (అ) చేసిన ప్రార్థనా ఫలితంగా కనబడుతోంది. అల్లాహ్ అర్ష్‌కు నేరుగా భూమిలో ఉన్న పవిత్ర ప్రార్థనాలయం. అజాన్ పలుకులతో అనంత జనవాహినిని ఆహ్వానిస్తున్న మీనార్ శిఖరాగ్రాలు. నలువైపులా భక్తీపారవశ్యాలలో ఓలలాడుతున్న సుభక్త జనాలు. వారి గుండెల్లో సత్య సుగంధాలు, శాంతి సౌరభాలు వెదజల్లుతున్న మలయ పవనాలు. ఆత్మను వింతానుభూతికి, దివ్యత్వానికి లోను చేస్తున్న మృదు మధుర పవిత్ర ఖుర్‌ఆన్ పారాయణాలు. ఓహో...ఇంకా లోపలికి వెళ్ళి చూడాలి.. అవిగో అద్దాల వంటి పాలరాతి స్తంభాలు..వాటిలో ప్రతిబింబిస్తూ అగుపించే తెల్లటి దుస్తులు ధరించిన హాజీల దేహాలు...ఆత్మసౌందర్యానికి ఆదర్శ రూపాలు...! ఏనాటిదీ ప్రాతిష్ఠాలయం?.... ఈ పవిత్ర గృహం ముందు ఎన్ని వందల యుగాలు బృంద స్తోత్రం చేసినవో!? ఈ కాబా లోపల ఎంతటి సుదీర్ఘ కాలం కొవ్వొత్తిలా కరిగిపోయినదో!? నిన్నటిదా మరి మొన్నటిదా... ఇది ఎన్ని యుగాల చరిత్ర! దైవ దూతలు తమ స్వహస్తాలతో కట్టిన భువన స్వర్గ భవనం అదికదా!!

ఈ మస్జిదె హరామ్ కోసం ఉపయోగించిన రాళ్లని రాళ్ళని ఎలా అనగలం? మట్టిని కరచుకొని మౌనంగా పడి ఉండే మొండి రాళ్ళెక్కడ? నిరతం వినిర్మల వాతావరణంలో పవిత్ర ఖుర్‌ఆన్ పారాయణాల్ని, ప్రార్థనా దృశ్యాల్ని వినే, కనే భాగ్యం వీటికి మాత్రమే లభించింది. శిలలా అవి కావు; భక్తీభావాలు ఉప్పొంగగా జలజలా పొంగిన అలలు. అలలా కావివి; అందంగా మలచి నిలబెట్టిన బంగారు కలలు. ఇన్ని అద్భుత దృశ్యాల్లో దేన్నని చూడాలి. ఒక్కొక్కటి ఒక జీవితానికి ప్రతీక. మాతృమూర్తి హజ్రత్ హాజిరా (అ) గారి అపూర్వ విశ్వాసానికి నిలువుటద్దం **సఫామర్వాల సయీ.** సుభక్తుల్ని ఆ సర్వేశ్వరుడు ఎలా ఆదుకుంటాడనటానికి సజీవ సాక్ష్యం **జంజం జల నిధి.** తండ్రికొడుకుల నిరుపమాన త్యాగానికి, ఆదర్శ వాత్సల్యానికి ప్రతిరూపం **కాబా కట్టడం.** పుణ్య పుత్రుని అనితరసాధ్య విధేయతకు ప్రబల తార్కాణం **'ఖుర్బానీ-మినా ప్రాంతం'.** ధర్మమూ, త్యాగమూ, సౌందర్యమూ, భక్తీభావమూ పరస్వరం కలిసిపోయిన చోటిది. ఆవేశమూ, ఆలోచనా- ఒకే కొలిమిలో ఒదిగిపోయిన స్థలం ఇది.

ఓహో! ఏమి స్తోత్రాలు. భక్తిపరవశులైన విశ్వాసుల అధరాలు. ఎటు చూసినా అల్లాహ్ నామస్మరణలు....సంస్మరణలు...ఇస్తిగ్ఫార్లు... తౌబాలు.... పశ్చాత్తాపాలు... అశ్రువులు పొంగుతున్న నయనాలు...పాపభీతితో కంపించిపోతున్న హృదయ పాదరిళ్ళు... కన్నీటి ధారతో సస్యశామలం అవుతున్న మనోభిళ్ళు...!!

(పారవశ్యంలో) ఎంత అందంగా ఉంటీ **'హజ్రె అస్వద్'.** అది స్వర్గం నుండి తేబడిన అపురూప శిలము. దివ్యకాంతి కరళ్లు ద్రొక్కినట్లు, ఏదో మహా సౌరభమే గుమ్మమై నిలిచినట్టు **'కాబా తలుపు'.** సందేహం లేదు అటుగా కనబడుతున్నది **'ముఖామె ఇబ్రాహీమే'**! ఈ రాయిపై నిలబడే ఆయన పవిత్ర ఆలయాన్ని నిర్మించినారు. సంశయానికి తావే లేదు అదుగో....**'మీఁజాబె రహ్మత్' సరిగ్గా 'హతీమ్'** లోపలి భాగంలోనే ఉంది. అక్కడ చేసే ప్రార్థన సర్వ విధాల స్వీకృతం. సందేహానికి ఆస్కారమే లేదు...దూరాన కనబడుతున్నది ముమ్మాటికి **'రుక్నె యమానీ'**యే. రుక్నె యమానికీ మరియు హజ్రె అస్వద్‌కి మధ్య **'రబ్బనా ఆతినా ఫిద్దున్యా హసనహ్ వఫిల్ ఆఖిరతి హసనహ్ వఖినా అజాబన్నార్'** చదవాలన్నది ప్రవక్త (స) వారి మాట.

మహనీయ ముహమ్మద్ (స) అంతిమ దైవ ప్రవక్త. అంతేకాదు ప్రవక్తలందరి నాయకుడు. మానవత్వం మూర్తీభవించిన మహితాత్ముడు. సత్ప్రవర్తనతో మనసుల్ని ఏలిన హృదయాల విజేత. మట్టిని మాణిక్యంగా తీర్చిదిద్ది, హరిణాన్ని (స్త్రీని) తరంగంగా కదను తొక్కించి, స్త్రీ స్వర్గానికి సోపానం అని ప్రకటించి, శఠ్ఠంగా, నిర్లిప్తంగా పడి ఉన్న బానిస జాతికి నల రూపంలో-దావానలరూపంలో ప్రజ్వలింపజేసిన జాజ్వల్యమూర్తి - మానవ మహోపకారి ముహమ్మద్ (స).

అరేబియా దేశంలోని మక్కా పట్టణంలో **'అబ్దుల్లాహ్ మరియు ఆమీనా'**లకు జన్మించి, అక్కడే ప్రవక్తగా ప్రభవించిన అగ్రజులు మహనీయ ముహమ్మద్ (స). విగ్రహ దాస్యం, మనిషి దాస్య భారంతో తలవంచుకుని పశువుకన్నా హీనంగా బ్రతుకుతున్న స్వజాతికి -మానవ జాతికి ఊతగా, నేతగా, భార్య విధాతగా అలరారి అంతిమ శ్వాస వరకు అవిరళంగా పరిశ్రమించి, జాతిమొత్తం స్వేచ్ఛ పొందగా, దాస్య శృంఖలాలు త్రెంచుకోగా, శాంతి తంత్రి నినదించగా పరవశించిపోతూ పరమపదించిన ప్రవక్తాగ్రేసర శిఖామణి ముహమ్మద్ (స). ఆ మహితాత్ముడు పుట్టిన నేలలో, ఆ మహాత్ముడు పీల్చిన గాలిలో కొన్ని క్షణాలైనా జీవించడం సమస్త మానవాళి సౌభాగ్యం.

ఇది హజ్జ్ మహారాధన మహోత్సవం. గతంలో మానవ మనో దర్పణాలకంటుకున్న మషీరసాన్ని కడిగివేసే మంచి తరుణమిది. మనలో ఎవ్వరైనా కాలు జారి అధర్మ అడుసులోకి దిగజారి ఉంటే నేడే...ఈనాడే పశ్చాత్తాపం వెలిబుచ్చండి. ఆత్మ ప్రక్షాళనంకన్నా అమల సాధనం మరొకటి లేదు. పాప గోపనంకన్నా పరమ నీచం ఇంకొకటి లేదు. ఆందోళనతో, ఆవేదనతో దేవుని సాన్నిధ్యం పొందలేము. తప్పులు ఒప్పుకున్న నాడే హృదయం నిర్మలమవుతుంది. పునీత హృదయులే అల్లాహ్ ఆదరానికి అర్హులు. నేటితో మన చిత్తం చలించకూడదు. మనం మనోతుచ్ఛ కోరికల రాపిడితో జ్వలించకూడదు. మనలోని చాంచల్యం నేటితో నశించిపోవాలి. అప్పుడే మన మీద అల్లాహ్ కరుణామృతం కురుస్తుంది. మనకు మన్నింపు లభిస్తుంది. కళ్లకు మిరిమిట్లు గొలిపే ఈ సృష్టి తేజస్సుకే మూలం అయిన అఖండ జ్యోతీశ్వరుణ్ణి స్వర్గంలో దర్శించుకుని జన్మ ధన్యం చేసుకునే మహదావకాశం ప్రాప్తిస్తుంది. కస్తూరి, కర్పూరం, జివ్వాజి, పునుగు, శ్రీచందం, పన్నీరు-ఒక్కటేమిటి లోకంలో ఉన్న సుగంధద్రవ్యాలన్నింటిలో ఏ ఒక్కటీ సరితూగదు స్వర్గ సురభి ముందు. స్వయంగా ఆ పరమ పవిత్రుడైన అల్లాహ్ స్వహస్తాలతో అలంకరించిన ఆ స్వర్గధామం..ఆహా! ఆ స్వర్గ సీమకు పాత్రులం అవుదాం రండీ!

telgo NOVEMBER.indd 4 10/20/11 4:01 PM

అబూ అతీఖ్

తెల్లవారితే సాయంత్రానికై నిరీక్షించకండి. నేడే...ఈ క్షణం పైనే దృష్టిని నిలపండి. గతించిన మంచీ చెబ్బరలను తలచుకుని కృంగిపోకండి. ఇంకా – రాని భవిష్యత్తును తలచుకుని ఊహాలోకాల్లో విహరించకండి. మీ ఆయుషు ఈ ఒక్క రోజే. మీకు దొరికింది ఈ ఒక్క పొద్దే. నేడే పుట్టినట్లు, ఈ నాటి కోసమే పుట్టినట్లు, ఈనాడే తనుమ చాలిస్తున్నట్లు ఒకసారి మీ మనసులో ఊహించుకోండి. ఈ ఆలోచన వచ్చిన ప్పుడు మీ జీవితం గతకాలపు నీలి నీడలకు, భవిష్యత్కాలకు, ఆశలకు, అభిలాషలకు మధ్య ఊగిసలాడుతున్నట్లు మీకనిపిస్తుంది.

మీరు మీ శక్తియుక్తుల్ని, తెలివితేటల్ని, సర్వస్వాన్ని నేటి కోసం ధారబోయండి. నేటి మీ ఆరాధనల్లో అశక్తత అణకువ అభివ్యక్తమవ్వాలి. మీ ఉపాసనల్లో వినయ వినమ్రతలు తొణికిసలాడాలి. గ్రంథ పారాయణంలో యోచనతో పాటు భక్తీ పారవశ్యం పరవళ్ళు త్రొక్కాలి. మీరు ఏది విన్నా జాగ్రత్తగా, సావధానంగా వినాలి. మీ ధ్యానంలో ఏకాగ్రత ఉట్టిపడాలి. మీ వ్యవహారాల్లో సమత్వం, సమతూకం ఉండాలి. నేటి మీ దినచర్యను చక్కగా విభజించుకోండి. నిమిషాలను సంవత్సరాలుగా, సెకన్లను మాసాలుగా పరిగణించండి.



మేళ్ల విత్తనాలు నాటండి. పరోపకారం చేయండి. పాపాల మన్నింపు కోసం ప్రార్థించండి. దైవనామాన్ని స్మరించండి. ప్రయాణ సామాగ్రిని సిద్ధం చేసుకోండి. ఇలా చేస్తే నేటి మీ దినం సాఫీగా, ఆహ్లాదకరంగా గడుస్తుంది. మీ మనసు కుదుట పడుతుంది. మీ కంటికి కునుకు పడుతుంది. మీ జీవనోపాధి మీకు తృప్తినిస్తుంది. మీరు మీ ఆలుబిడ్డల, ఆప్తుల మధ్య ఆనందంగా ఉండగలుగుతారు. మీ జీవితానికి సార్థకత లభిస్తుంది. **"నేను ఇచ్చిన దానిని (సంతోషంగా) పుచ్చుకో. కృతజ్ఞుడవై ఉండు".**

(దివ్యఖుర్‌ఆన్– 7:144)

నేడు మీకు లభించిన ఈ రోజు సుఖంగా గడిచిపోవాలి. దుఖం, ఆవేదన, ఆందోళన, కలవరం, వ్యాకులత, అసూయ, అక్కసు, ఓర్వలేనితనం మీ దరికి చేరకూడదు సుమా! మీరు మీ మనోఫలకంపై ఒకే ఒక వాక్యం లిఖించుకోండి – **" నేడే..ఈనాడే".** నేడు మీకు స్వాదిష్టమైన భోజనం లభిస్తే నిన్నటి చద్దన్నం వల్ల మీకు ఎలాంటి హాని కలగదు. నేడు మీకు చల్లని మంచినీరు లభ్యమైనపుడు నిన్నటి ఉప్పు నీటిపైగానీ, రేపటి కలుషితనీటిపై చింతించవలసిన పనేమిటి? మీరు గనక వజ్ర సంకల్పులై ఉంటే – **ఈ రోజు నాది. ఏ మంచి పనిచేసినా ఈ ఒక్క రోజే చేసుకోవాలి"** అని తలంచుకుంటారు. అప్పుడు ఈనాటి ఒక్కొక్క గంటను, ఒక్కొక్క ఘడియను సద్వినియోగం చేసుకుని, దాన్నుండి లబ్ధి పొందటానికి యత్నిస్తారు. అప్పుడు మీరే అంటారు–ఈ రోజు నేను నా నోటిని అదుపులో పెట్టుకుంటాను. చెడు అనను. చాడీలు చెప్పను. దుర్భాషలాడను. దురుసుగా మాట్లాడను. నా ఇల్లును, నా ఆఫీసును నీటుగా సర్దుతాను. ఏ పనినీ పెండింగ్‌లో పెట్టను. ప్రతిదీ సజావుగా నెరవేరుస్తాను. ఈ రోజు కోసం స్నానాలు ముగించుకుని చక్కని దుస్తుల్ని ధరిస్తాను. తైల సంస్కారం చేసుకుంటాను. మాటల్లోనూ – చేతల్లోనూ సమన్వయం సాధిస్తాను. నమాజుయందు మనసును లగ్నం చేస్తాను. దివ్యఖుర్‌ఆన్ పారాయణం చేస్తాను. పుస్తకాలు తిరగవేస్తాను. ఎందు కంటే నా జీవనం ఈ ఒక్క రోజే కదా! అందుకే హృదయమనే నందనవనంలో శుభాలమొక్క నాటుతాను. కీడు, కుట్ర, అసూయ, అహంకారం, అవినీతి, దురాలోచన లాంటి చెడులను కూకటి వ్రేళ్లతో పెకలిస్తాను. నా బ్రతుకు నేటితో ముగుస్తుంది– అందుకే ఇతరులను మేలు చేకూరుస్తాను. సాటి జనులతో సద్వ్యవహారం చేస్తాను. నా ఉనికి వల్ల ఎవరికీ కీడు జరగనివ్వను.



నా ఆయుషు ఈ ఒక్క దినమే. అందుకే రోగులను పరామర్శిస్తాను. అంత్యక్రియలలో పాల్గొంటాను. మృతుని వారసులను ఓదారుస్తాను. దారి తప్పిన వారికి దారి చూపుతాను. ఆకలిగొన్న వానికి అన్నం పెడతాను. కష్టాల్లో ఉన్న వారి కష్టాలను దూరం చేస్తాను. బాధితులకు అండగా నిలబడతాను. అభాగ్యులకు చేయూత నిస్తాను. బలహీనుల కొరకు సిఫారసు చేస్తాను. దుఖితులను పలకరిస్తాను. విద్వాంసులను ఆదరిస్తాను. దీనులపై దయచూపుతాను. పెద్దలను గౌరవిస్తాను.

నా జీవన యాత్ర నేటితో ముగుస్తుంది. అందుకే ఓ భూతకాలమా! ఆగకు, వెళ్ళిపో. పోయి సూర్యుని మాదిరిగా అస్తమించు. నీ అస్తమయంపై నేనెంత మాత్రం దుఖించను. క్షణ కాలం కోసం కూడా నిన్ను స్మరించుకోను. ఎందుకంటే నీవు గతించావు. నా నుండి దూరమైపోయావు. నీవిక ఎన్నటికీ తిరిగి రావు.

ఓ భవిష్యత్కాలమా! నీవు అగోచర అవస్థలో ఉన్నావు. అందుకే నీగురించి అట్టే కలలు గని ప్రయోజనం లేదు. నువ్వింకా ప్రభవించలేదు. అలాంటప్పుడు నిన్ను వెంటాడి సాధించేదేముంటుంది?

ఓ మానవుడా! నేటి ఈ దినమే సౌభాగ్య నిఘంటువులోని అత్యుత్తమ వాచకం. దీన్ని గురించి ఆలోచించిన వాడే జీవితంలోని సౌందర్యాన్ని, సౌకుమార్యాన్ని పరమార్థాన్ని తనివితీరా ఆస్వాదించ గలుగుతాడు.

(ఆధారం: డా. ఆయిజ్ అబ్దుల్లాహ్ అల్ ఖర్‌నీ గారి **"లా తహ్‌జన్ "** పుస్తకం)

telgo NOVEMBER.indd 5 10/20/11 4:01 PM

కీర్తిశేషుల దృష్టిలో కులం




భగవద్గీత: బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర, యీ నాలుగు వర్ణముల వారు – (కులాలవారు) వారి వారి గుణ, కర్మ భేదముల ననుసరించియే యుందురు. (4 అ. 133 శ్లో)



గౌతమ బుద్ధుడు: జన్మను బట్టి ఏ మానవుడూ బ్రహ్మణుడుగా గాని చండాలుడుగా గాని కాజాలడు. గుణమును బట్టియే కుల వ్యవస్థ ఏర్పడెను.



నారద మహా ముని: ఈశ్వరమయమైన ఈ ప్రపంచంలో అసలు జాతిభేదము (కుల భేదము) అనునది ఏదీ లేనేలేదు. చేసే కర్మను (పనిని) బట్టియే జాతిభేదము ఏర్పడును.



రామకృష్ణ పరమహంస: జన్మతో ఎవరికీ ఉచ్చ – నీచాలు సంక్రమించవు.



శంకరాచార్యులు: లోకంలో ఎవరికిని పుట్టుకచేతనే గొప్ప తనము రాదు. అది యత్నపరంపర చేతనే రావలెను. చెడిపోయిన (కుళ్ళిపోయిన) అన్నమువలే ఈ నాటి కుల వ్యవస్థయును పాడైపోయినది.



శుక్రాచార్యులు: కేవలం జన్మతోనే ఎవ్వడూ బ్రాహ్మణుడుగా గాని శూద్రుడుగా గాని, మరొకడుగా గాని కాజాలడు.



స్వామి దయానంద సరస్వతి: పూర్వ రోజులలో అన్య వర్ణస్థులకు పుట్టినవారు బ్రాహ్మణులు కాగలిగే వారు. (దానికి ఉదాహరణలు అనేకం) కనుక ఇప్పుడు ఉత్తమ విద్యాది, శుభ గుణ స్వభావాలు గలవారు ఏ కులం వారైనాసరే బ్రాహ్మణులుగా ఎంచబడాలి.

జన్మ మూలక వర్ణ వ్యవస్థ అతి నీచమైనది, లోపభూయిష్టమైనది. అది సంఘానికి గొప్ప నష్టాన్ని కలిగిస్తుంది.




ఆపస్తంబవాది గ్రంథాలు: జన్మమూలకమైన వర్ణ వ్యవస్థ కుల దురభిమానాల, రాతి విగ్రహాల పూజ వంటి ఆచారం వట్టి కల్పితము.



గురునానక్: భగవంతుని సాన్నిధ్యమున జన్మ మూలకమైన జాతి (కులము) అడగబడదు, కాని మానవుడు చేయు పనిని బట్టియే వానికి గౌరము కలుగును.



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్: ఈ కులమనే పెనుభూతాన్ని తుదముట్టించనిదే మన దేశంలో రాజకీయ, ఆర్థిక, సాంఘిక సంస్కరణలు సాధ్యం కావు. ఎప్పుడో పూర్వం కొందరు బ్రాహ్మణులు సమాజంలో తమ ఆధిక్యతను నిల్పుకోవటానికి ఏర్పచిన ఈ కులాలను పాటించటంలో అర్థం లేదు. ఒకవేళ ఈ కుల వ్యవస్థను దేవుడే ఏర్పాటు చేసినట్లయితే, నేను అతనిని దేవునిగా గుర్తించను.



స్వామి ధర్మతీర్థ: నీవు కుల వ్యవస్థ యొక్క నిర్దాక్షిణ్యమైన నియమాలను సడలింపజేసి, భ్రాతృ భావాన్ని వ్యాపింపచేయగలవని దేశము, ధర్మము ఆశిస్తున్నాయి.



రవీంద్రనాథ్ ఠాగోర్: ఆలోచనా కాంతిని, బ్రతుకు ఊపిరిని చొరవనివ్వకుండా అడ్డుగోడలను కులం నిర్మించింది. దీని నుండి రక్షణ కోరేవారు వెంటనే వర్ణ వ్యవస్థను నిర్మూలింపజేయవలయును.



మహాత్మ గాంధి: ఈనాటి వర్ణ వ్యవస్థ సమాజాభివృద్ధికి ఒక గొప్ప ఆటంకముగా కనిపించుచున్నది. నేటి మానవులలోని అసమానతలు కూడా కుల వ్యవస్థ వలననే కలిగినవి. ఈ కుల వ్యవస్థ ముఖ్యంగా దాన్ని నమ్మేవారికి ఒక గొప్ప అభిశాపమే. ఈ కులతత్వం ఒక రాచ పుండు వంటిది. అభివృద్ధికి ఇది అంతరాయం. మానవుల మధ్య ఉండే హెచ్చు తగ్గులు నాకు గిట్టవు. మనందరము సమానులము. ఈ హెచ్చు–తగ్గులు మానవ కల్పితాలు. ఇతర మానవులకంటే తాను అధికుడని చెప్పుకొనే వానిని దైవ ద్రోహి, సంఘ ద్రోహి అని చెప్పాలి.



సి.పి: ఈ కుల వివక్ష కారణంగానే గుర్రం జాషువా క్షణక్షణమూ అవమానాల అగ్నిలో కాలిపోయాడు. ప్రపంచంలోని ఏ దేశంలోనూ లేని ఈ క్యాన్సర్ నేటికీ మన ప్రజలను వదలలేదు. ఈ శతాబ్దాల పీడ విరగడ కానంత వరకూ, ఈ శని వదలనంత వరకూ ఈ జాతికి విముక్తి లేదు. ఈ ప్రజకు భవిష్యత్తు లేదు.



స్వామి వివేకానంద: ఈ రోజులలో బ్రాహ్మణ కులము, బ్రాహ్మణ గుణము రెండూ వేరు విషయాలు. భారత దేశంలో కులము వలన బ్రాహ్మణుడుగా భావించబడుతున్నాడు. కాని పశ్చిమ దేశాలలో బ్రాహ్మణ గుణము వలన బ్రాహ్మణుడుగా ఎంచబడుతున్నాడు.

telgo NOVEMBER.indd 6 10/20/11 4:02 PM



ఆచార్య వినోబా భావే: భారత దేశంలో అనేక కులాలున్నాయి. వీటిని ఎవ్వరూ కోరుట లేదు. ఈ కులాలను తొలగించటం మనలో ప్రతి ఒక్కరి విధి. వర్ణ రహిత, కుల రహిత సమాజ స్థాపన జరగాలి.

ఆరుద్ర: భారత సమాజంలో ఉన్న బాధలకు, దుఃఖాలకు, దురహంకారానికి, దౌర్జన్యానికి, గర్వానికి, హైన్యానిక మూల కారణం వర్ణ వ్యవస్థయే. –మానవులలో ఎక్కువ తక్కువలు ఉన్నంత కాలం చిక్కులు తప్పవు. చావడంలో అందరూ సమానులైనప్పుడు బ్రతకడంలో ఎందుకు సరి సమానులు కాకూడదు? లోకమంతా ఒకే కుటుంబం. లోకులంతా ఒకే కుటుంబ సభ్యులు. ఎవ్వరూ పంక్తి బాహ్యులు కారు. అందరూ ఒక్క కంచాన తింటే, అన్ని బాధలకూ హేతువైన కులభేదం రూపుమాసి పోతుంది. సఖ్యత మాత్రమే ఉంటుంది.



ప్రజలందరి హృదాయాలలో అంతరంగికంగా ఉన్న ఈ భావననే, పై పేర్కొనబడిన ప్రముఖులందరూ వ్యక్త పర్చారు. అయితే ఇటువంటి ఒక వ్యవస్థను అక్షరాలా ఈ అవని మీద స్థాపించిన వారు ఎవరైనా ఉన్నారా? అన్న ప్రశ్న మాత్రం ప్రశ్నగానే ఉంటుంది. ఆప్రశ్నకుసరైన సమాధానమే దైవ అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స). ఆ సమస్యకు సరైన పరిష్కారమే ఆయన (స) స్థాపించి వెళ్ళిన సత్సమాజం. అది ఎలా సాధ్యమైంది? సాధ్యమవుతుంది? అంటే, వివరాల్లోకి వెళ్ళాల్సిందే.

వంశం, జాతి, భాష అనేవి ఒక దశలో మనిషికి మేలు చేసినవే. అయితే మనిషిని మహా మనీషిగా మలిచే మార్గంలో అన్నింటి కన్నా పెద్ద అవరోధం మనుషుల మధ్య గల ఈ అసమానతలే. ప్రపంచ జాతులు, ప్రపంచ మతాలు, ప్రపంచ భాషలు, ప్రపంచ దేశాలు ఏదోక పేరుతో, ఏదోక రూపులో, ఏదోక స్థాయిలో మనిషీ –మనిషికీ మధ్య ఈ **'అసమానతల'**ను పాటించేవారు. ఈ నిమ్నోన్నతా భేదభావాలకు, జాతి, కుల, భాష వివక్షకు ప్రభుత్వాలు, రాజరికాలు సయితం అండగా నిలవడం వల్ల సమస్య మరింత జఠిలంగా మారేది. ఈ కృత్రిమ భావనలపై, ఈ కుహన ప్రతిష్టలపై ప్రశ్నించే అధికారం ఎవరికీ ఉండేది కాదు. మానవ సమానత్వం గురించి మత పీఠాలతో చర్చించే అనుమతి, నిలదీసే ధైర్యం సామాన్యులకు ఉండేది కాదు. అగ్రవర్ణాల వారు శ్రామిక ప్రజల శ్రమను సొమ్ము చేసుకోవడంతోపాటు వారిని నీచులుగా, పంచములుగా భావించేవారు. బానిసలకు తమ యజమానుల సరసన నిలబడే అర్హత లేదనే వారు. అటువంటి దుర్భర, దయనీయ, చీకటి తరుణంలో స్వేచ్ఛా వాయువుల్ని వ్యాపింపజేస్తూ ఆవిర్భవించారు సత్య ప్రవక్త ముహమ్మద్ (స).

ఆయన ప్రజలను జాతి వైపునకో, భాష వైపునకో, కులం వైపునకో ఆహ్వానించ లేదు. వీటి ఏ ఒక్కటీ మానవ జాతిని సమైక్య పర్చ జాలదని ఆయనికి బాగా తెలుసు. ఆయన మానవాళిని వారి హృదయాంతరాళ్లల్లో నిబిడీకృతమై ఉన్న **'సహజ భావం–దేవుడు ఒక్కడే'** అన్న అంశం వైపు ఆహ్వానించారు, దాన్నే సకల సమస్యలకు పరిష్కారంగా ఎంచారు. దాని ప్రాతిపదికపైనే ఒక సత్సమాజాన్ని స్థాపించారు. తన ఆఖరి హజ్జ్ సందర్భంగా సమస్త మానవాళిని ఉద్దేశ్యించి ఇలా అన్నారు: నేటి నుండి ఈ నిమ్నోన్నతా భేద భావాలు, ఈ ప్రత్యేకతలు, కుహానా కట్టుబాట్లు అన్నీ ఒక్కసారిగా తునాతునకలై పోయాయి. అరబ్బులకు అరబ్బేతరులపైగానీ, అరరబ్బేతరులకు అరబ్బులపైగానీ, నల్లవారికి తెల్ల వారిపైగానీ, తెల్లవారికి నల్లవారిపైగానీ ఎలాంటి ఆధిక్యతకు, శ్రేష్ఠతకు ఆస్కారం లేదు. మీరంతా ఆదం బిడ్డలే. ఆదము మట్టి తో సృజించ బడ్డారు. అజ్ఞాన కాలపు ప్రతీకార వాంఛలన్నీ మిథ్యగా ప్రకటించ బడుతు న్నాయి. అజ్ఞాన కాలం నాటి వడ్డీ వ్యాపార లావాదేవీలన్నీ అధర్మంగా ఖరారు చేయబడుతున్నాయి. తాగుబోతుల సారాయి కోస అమ్ముడుబోయే, జూదరాయళ్ల గొంతెమ్మ కోర్కెలకు బలయ్యే ఈ కలకంఠి కన్నీరు తుడిచే, ఈ అబల కష్టాలను తీర్చే, ఈ గృహ రాణికి కీర్తి కిరీటం తొడిగించే రోజు వచ్చే సింది. ఆమె స్వర్గానికి అడ్డంకి కాదు, సోపా నం. తల్లి అయిన ఆమె పాదాల చెంతనే స్వర్గ ధామం ఉంది. **ఈ రోజు, ఈ మాసం, ఈ నగరం మీ కోసం ఎంత పవిత్రమో, మీ తనం, ధనం, మానం ప్రళయ దినం వరకూ అంతే పవిత్రంగా పరగణించబడుతోంది.**

ఇస్లాం పరిపూర్ణం కాక పూర్వం ప్రపంచంలో అనేక మతాలు ఉద్భవించాయి. కాని వాటి పునాది ఆ మత స్థాపకుల లిఖిత పూర్వక ధార్మిక సూత్రాలపై నెల కొనలేదు. దేవుని తరఫున లభించిన మార్గదర్శక సూత్రాలను ఆయా మతాధిపతులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మార్చుకోవటమో లేదా వాటి వాస్తవికతను, ప్రాధాన్యతను తగ్గించటమో చేశారు. అయితే సంపూర్ణం, శాశ్వత ధర్మానికి అంతిమ ప్రవక్తగా పంప బడిన ఈ మానవ మహోపకారి (స) దైవాదేశాలను, తన ఆదర్శాలను తన అనుచరుల పరం చేస్తూ వాటిని నిరంతరం హృదాయానికి హత్తుకోవాలనీ, వాటిలో మార్పుచేర్పులు చేయరాదని తాకీదు చేశారు. సరిగ్గా ఆ సమ యంలోనే ఈ దైవ వచనం అవతరించింది:

"ఈ రోజు నేను మీ ధర్మాన్ని మీ కోసం పరిపూర్ణం గావించాను. నా అనుగ్రహాలను కూడా ఇక దీనితో పరిపూర్ణం చేశాను. ఇస్లాంను మీ కోసం (జీవన ధర్మంగా) సమ్మ తించాను". (అల్ మాయిదా: 3)

ఆశ్చర్యకరమై విషయం ఏమిటంటే ఈ హృదయాల విజేత లక్షలాది మంది అనుచరుల మధ్య ఈ శాసనాలను జారీ చేస్తున్నప్పుడు ఒంటెపై ఆయన ఆసీనులై ఉన్న గద్దె ఒక రూపాయికన్నా ఎక్కువ విలువైనది కాదు. **'ప్రవక్తలు తమ వెనకాల ఏ పదవినో, పసిడి నో వదలి వెళ్ళరు. విద్య, విజ్ఞానం, వివేకాన్ని మాత్రమే వదలి వెళతారు'** అన్న ఆయన అపూర్వ వచన కారణంగానే శతాబ్దులు గడిచిపో యినా ఆయన అందజేసిన సత్యాన్ని, సమాజ న్యాయాన్ని నేటికీ సత్యప్రియులు అనేకులు గ్రహించి ఇస్లాం ఛత్ర ఛాయల్లో వచ్చి సేద తీరుతున్నారు. అలా ఇస్లాం విశిష్టతను గుర్తించిన వారిలో తమిళ రాష్ట్రానికి చెందిన పెరియార్ రామస్వామి కూడా ఒకరు. ఆయన ఇలా అన్నారు:



"మనం ఎదుర్కొంటున్న ఈ కుల సమస్య చాలా దుర్భరమైనది. క్యాన్సర్ కుష్ఠు వంటి మొండి రోగం ఇది. దీనికి ఒకే ఒక పరిష్కార మార్గం ఉంది. అదే ఇస్లాం. ఇంతకు మినహా దీనికి ఇతర (ఏ మతము, మరే సిద్ధాంతమూ) చికిత్స కాజాలదు. కాదంటే ఈ మహా మ్మారిని ఇలాగే భరిం చేందుకు సిద్ధంగా ఉండాలి. బాధను తప్పించుకునేందుకు, తగ్గించుకునేందుకు నిద్ర పుచ్చే మత్తు కలిగించే మాత్రలు వాడుతూ పోతే మనం కుళ్ళి కంపు కొట్టే శవాలుగా మారిపోతాం. ఈ రోజుల్లో మన వ్యవహారాలని మనం చక్కదిద్దుకోవాలంటే ఇస్లాం ఒక్కటే మార్గం. అదొక్కటే మనకు మంచిని చేకూరుస్తుంది. మనం తలెత్తుకుని నిటారుగా ముందుకు నడిచేట్టు చేస్తుంది. మనకు కావాల్సిన ధైర్యాన్ని, మనోస్థయిర్యాన్ని ఇస్తుంది.

(మిగతాది 11వ పేజీలో)

telgo NOVEMBER.indd 7 10/20/11 4:02 PM

ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

పరలోక ప్రయాణం



సమాధి



ఇది పరలోక ప్రయాణంలోని మొట్టమొదటి మజిలీ. కపటుల, అవిశ్వాసుల పాలిట ఇది అగ్ని గుండం. విశ్వాసుల పాలిట స్వర్గ తాకిడి. కొన్ని రకాల తప్పులుచేసిన వారికి సమాధి యాతన ఉంటుందని స్పష్టమైన ఆధారాల ద్వారా తెలుస్తోంది. ఉదాహరణకు: మూత్ర విసర్జన సమయంలో అజాగ్రత్తగా ఉండటం, చాడీలు చెప్పటం, యుద్ధప్రాప్తిలో నుంచి సొమ్ము దొంగిలించటం, అబద్ధాలాడటం, నమాజు వేళల్లో నిద్రిస్తూ ఉండటం, ఖుర్‌ఆన్ పట్ల అలసత్వం ప్రదర్శించటం, వ్యభిచారం, స్వలింగసంపర్కం, వడ్డీ సొమ్ము తినటం, అప్పుతీసుకుని తీర్చకపోవటం మొదలగునవి. మరి కొన్ని రకాల పనులు సమాధి యాతన నుండి విముక్తికి దోహదకారి అవుతాయి. ఉదాహరణకు: చిత్తశుద్ధితో చేసిన పుణ్య కార్యాలు, సమాధి శిక్ష నుండి శరణు వేడుతూ ఉండటం, అల్ ముల్క్ సూరా పారాయణం మొదలగునవి. సమాధి యాతన నుండి సురక్షితంగా ఉండేవారెవరంటే, అమరగతులు, రాజ్య సరిహద్దులపై కాపలాగా ఉండే వారు, శుక్రవారంనాడు చనిపోయినవారు, జీర్ణకోశ వ్యాధితో చనిపోయిన వ్యక్తి మొదలగువారు.

శంఖం ఊదబడటం



శంఖం ఒక గొప్ప బిగులు(సైరన్). దీనిని హజ్రత్ ఇస్రాఫీల్ తన నోటిలో పెట్టుకుని, ఎప్పుడు దైవాజ్ఞ అవుతుందోనని ఎదురు చూస్తున్నారు. ఈ శంఖం రెండుసార్లు ఊదబడుతుంది. మొదటి సారి శంఖారావం అందరినీ కలవరానికి భీతావహస్థితికి లోను చేస్తుంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"శంఖం ఊదబడే రోజున ఆకాశాలలో ఉన్నవారు, భూమి పై ఉన్నవారంతా భీతావహులై పోతారు. కాని అల్లాహ్ తలచిన వారికి మాత్రం ఆ స్థితి ఏర్పడదు". (అన్ నమ్ల్-87)


మొదటి సారి శంఖం ఊదగానే లోకమంతా తలక్రిందులైపోతుంది. 40 ఏండ్ల తరువాత రెండవసారి శంఖం పూరించబడుతుంది. ఇది పునరుత్థాన శంఖారావం. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"మళ్ళీ శంఖం పూరించబడగానే వారంతా ఒక్కసారిగా లేచి చూడ సాగుతారు".** (అజ్జుమర్ - 68)



ఆ సమయంలో అల్లాహ్ విచిత్రమైన వర్షం కురిపిస్తాడు. దాని ప్రభావంతో (వెన్నెముక చివరి భాగం నుంచి) శరీరాలన్నీ మొలుస్తాయి. అదొక వినూత్న, అద్వితీయ సృష్టి. వారికి ఇక ఎన్నడూ మరణమనేది ఉండదు, మనుషులంతా నగ్నంగా ఖత్నా చేయబడని స్థితిలో ఉంటారు. జిన్నుల్ని, షైతానుల్ని చూడగలుగుతారు. వారు తమతమ కర్మలను బట్టి లేపబడతారు. హజ్ ఉమ్రాల నిమిత్తం **'ఇహ్రామ్'** దీక్ష బూని మరణించినవారు **'ఇహ్రామ్'** వస్త్రం ధరించిన స్థితిలోనే తల్బియా పఠిస్తూ లేచి వస్తారు. అమరవీరుని రక్తం స్రవిస్తూ ఉంటుంది. పరధ్యానంలో ఉన్నవారు పరధ్యానస్థితిలోనే లేపబడతారు. దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"ప్రతి వ్యక్తీ ఏ స్థితిలో మరణించాడో ఆ స్థితిలోనే లేదా ఆ కర్మలపైనే లేపబడతాడు". (ముస్లిం)

సమీకరణ (హష్ర్)



మరి అల్లాహ్ సమస్త మానవాళిని లెక్కా చారం కొరకు ఒకానొక రోజున సమావేశ పరుస్తాడు. ఆ రోజు సుదీర్ఘమైనది. అది 50 వేల సంవత్సరాలకు సమానంగా ఉంటుంది. జనులు కలవరంతో తమను తాము మరచిపోయిన స్థితిలో ఉంటారు. ప్రపంచంలో మహా అంటే ఒక గంటసేపు గడిపి ఉంటామని వారికి అనిపిస్తుంది. సూర్యుడు వారికి చాలా దగ్గరగా-ఒక్కమైలు దూరంలో-తీసుకు రాబడతాడు. ప్రజలు తమతమ కర్మలను బట్టి చెమటలో మునిగి ఉంటారు. బలహీనులకు- గర్విష్టులకు మధ్య వాగ్యుద్ధం జరుగుతుంది. అవిశ్వాసులతో వారి సహవాసులు, షైతాను గొడవ పడతారు. ఆఖరికి వారి శరీరావయవాలు కూడా వారికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయి. ప్రజలు పరస్పరం నిందించుకుంటారు. శపించుకుంటూ ఉంటారు. దుర్మార్గుడు తన చేతులను కసిగా నములుతూ **"అయ్యో! నా పాడుగాను. నేను ఫలానా వ్యక్తిని స్నేహితునిగా చేసుకోకుండా ఉంటే ఎంత బావుండేది!"**(అల్‌ఫుర్ఖాన్-28) అని అంటాడు.

ఆ రోజు నరకం ఆవేశంతో పూగిపోతూ ఆగ్రహంతో బ్రద్ధలైపోతుందా! అన్నట్టుంటుంది. 70 వేల కళ్ళాలతో దాన్ని లాగుతూ ఉంటారు. ఒక్కో కళ్ళాన్ని 70 వేల మంది దైవ దూతలు పట్టుకుని ఉంటారు. దైవతిరస్కారి నరకాన్ని కళ్ళారా చూసినపుడు నీరుగారిపోతాడు. తన దగ్గర ఉన్నదంతా పరిహారంగా ఇచ్చేసి నరకాగ్ని నుండి విముక్తి పొందగోర్తాడు. లేదా తాను మట్టినైపోయినా బావుండునే అని తలపోస్తాడు. ఇదీ అవిశ్వాసుల పరిస్థితి.

ఇకపోతే పాపాత్ములైన విశ్వాసులు, వారిలో జకాత్ సొమ్మును చెల్లించని వారికి విధించబడే

telgo NOVEMBER.indd 8 10/20/11 4:02 PM

శిక్ష ఏమిటో తెలుసా!? వారి సిరిసంపదలతో అగ్ని పలకలు తయారు చేసి వారి శరీరాలకు వాతలు వేయటం జరుగుతుంది. ప్రపంచం లో అహంకారంతో విర్రవీగిన వారు ఆ నాడు చిన్నచిన్న చీమల రూపంలో లేపబడతారు.

ఈ మహ్‌షర్ మైదానంలో నమ్మకద్రోహులు, అక్రమ కబ్జాలు చేసిన వారు, ఇతరుల ఆస్తిని కబళించినవారు, దగాకోరులు పరాభవం పాల్జేయబడతారు. దొంగవాడు తాను దొంగ లించిన ప్రతి బండారం బట్టబయలవుతుంది. అయితే సజ్జనులు, దైవభీతిపరులు మాత్రం ఈ అవమానస్థితి నుండి సురక్షితంగా ఉం టారు. వారికెలాంటి చీకూచింతా ఉండదు. పైగా ఆ రోజు వారి పాలిట ఒక నమాజు వేళగా – జుహ్‌ర్ నమాజు వేళగా – గడచిపో తుంది.

సిఫారసు



'షఫాఅతె ఉజ్మా' (అతి గొప్ప సిఫారసు) అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స)కే ప్రత్యే కించబడింది. హష్‌ర్ దినాన సమస్త మాన వులు ఎదుర్కొంటున్న గడ్డు స్థితిని ఈ **'సిఫా రసు'** తొలగించి, లెక్కాచారానికి అవకాశం కల్పిస్తుంది. వేరితర 'సిఫారసులు' హష్‌ర్ దినా నికి ప్రత్యేకం కావు. అవి దైవ ప్రవక్త(స)కు ఇతరులకు కూడా ప్రాప్తమవుతాయి. ఉదాహరణకు:– నరకానికి ఆహుతి అయిన ముస్లింలను నరకం నుండి విమోచనం కల్పి ంచే సిఫారసు, స్వర్గవాసుల అంతస్తులను పెంచటానికి ఉద్దేశించిన సిఫారసు.

లెక్కలు-న్యాయ విచారణ



ప్రజలు వరుసక్రమంలో అల్లాహ్ సన్నిధిలో హాజరు పరచబడతారు. అల్లాహ్ వారి కర్మల ను వారికి ఎరుకపరుస్తూ వాటిని గురించి ప్రశ్నిస్తాడు. వారి యవ్వనం, వయసు, ధనము, జ్ఞానం, వాగ్దానాల గురించి నిలదీసి అడగటం జరుగుతుంది. అలాగే ప్రాపంచిక అనుగ్రహాల గురించి, కళ్ళు, చెవులు, హృద యాల ఉపయోగం గురించి ప్రశ్నించబడు తుంది. అవిశ్వాసులు, కపటులు సమస్త మాన వాళి సమక్షంలో ప్రశ్నించబడతారు. అల్లాహ్ వారిని ధూత్కరిస్తాడు. అవమాన పరుస్తాడు. వారి న్యాయ విచారణ జరుగుతుంది. జనులు వారికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తారు. వారు సంచరించిన నేల, రేయింబవళ్ళు, సిరిసంప దలు ఆర్థిక ఒనరులు దైవ దూతలు, శరీరావ యవాలు–అన్నీ సాక్ష్యమిస్తాయి. దాంతో వారి నేర చరిత్ర అంతా రుజువవుతుంది. (తద్భి న్నంగా) అల్లాహ్ నిశ్వాసులను ఏకాంతంలో కలుస్తాడు. వారిని ప్రశ్నించి వారి తప్పులను అంగీకరించేలా చేస్తాడు. ఇక తమకు వినాశం తప్పదని వారనుకుంటారు. అప్పుడు అల్లాహ్ వారితో ఇలా అం టాడు: **"నీవు చేసిన ఈ పాపాలను నేను ఇహ లోకంలో మరుగు పర చాను. నేను వాటిని నీ కోసం మన్నిస్తు న్నాను."** (బుఖారీ)

అందరికన్నా ముందు ముహమ్మద్ (స) అనుయాయుల లెక్క చూడ బడుతుంది. కర్మలలో మొదట నమాజ్ లెక్క జరుగుతుంది.

కర్మ పత్రాల పంపిణీ



తరువాత వారి ప్రోగ్రస్ రిపోర్టులు వారికివ్వ బడతాయి. ఆ రిపోర్టు ఎంత క్షుణ్ణంగా ఉం టుందంటే దాన్ని చూసిన అపరాధులు హడ లెత్తిపోతారు. వారు **"ఇదేమి పత్రం!? ఇది ఏ చిన్న నిషయాన్నీ, ఏ పెద్ద విషయాన్నీ వదల కుండా నమోదు చేసిందే!?"** అని ఆశ్చర్య పోతారు. (అల్ కహఫ్ – 49)

విశ్వాసి తన కర్మల పత్రాన్ని (ముందు నుంచి) కుడి చేతిలో తీసుకుంటారు. అవిశ్వాసి, కపటి అయినవ్యక్తి తన కర్మల రికార్డును (వెనుక వైపునుంచి) ఎడమ చేతిలో తీసుకుంటాడు.

త్రాసు (ధర్మ కాటా)



ఆ రోజు దాసుల కర్మలు తరాజు (త్రాసు) లో తూయబడతాయి. ఆ తరాజు ఖచ్చితం గా, న్యాయబద్ధంగా తూస్తుంది. దానికి రెండు పళ్ళాలుంటాయి. దాసులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ఉండటానికి ఈ వ్యవస్థ ఏర్పరచబడింది. చిత్తశుద్ధితో కూడిన కర్మలు, షరీఅతు అనుగుణంగా ఉన్న సత్కా ర్యాలు త్రాసుపళ్ళెంలో బరువు గలిగి ఉం టాయి. ఆ త్రాసులో బరువుగా ఉండే కొన్ని కర్మలు ఇవి: కలిమా–**లా ఇలాహ ఇల్లల్లాహ్,** మంచి నడవడిక, దైవధ్యానం. ఉదాహర ణకు: అల్‌హమ్దులిల్లాహ్, సుబ్‌హా నల్లాహి వ బిహమ్దిహీ సుబ్‌హానల్లాహిల్ అజీం. ఇక్కడ మనుషులు సత్కర్మలు–దుష్కర్మల లావాదేవీలపై ఒక అంగీకారానికి కూడా వస్తారు. అంటే ప్రపంచ జీవితంలో కాజేయ బడిన హక్కులను గాను పరిహారంగా ఒకరి సత్కార్యాలు ఇంకొకరికి మార్పిడీ అవుతాయి. అలాగే దుష్కర్మల మారకం కూడా జరుగుతుంది.

సరస్సు (హౌజ్)



తరువాత విశ్వాసులు సరస్సు(హౌజ్) వద్దకు వస్తారు. ఆ సరస్సు జలం ఒకసారి సేవించిన వారికి ఇక ఎన్నడూ దాహ మవదు. ప్రతి ప్రవక్త కోసం ఒక సరస్సు ఉంటుంది. మహాప్రవక్త ముహమ్మద్(స) వారికి ప్రత్యేకించబడిన సరస్సు అన్నిటికన్నా పెద్దదై ఉంటుంది. దాని జలం పాలకన్నా తెల్లగా, తేనెకన్నా తియ్యగా, కస్తూరికన్నా ఎక్కువ సువాసన కలదై ఉంటుంది.

అక్కడి పాత్రలు వెండీ బంగారంతో చేయ బడినవై ఉంటాయి. వాటి సంఖ్య నక్షత్రాల కు సమానంగా ఉంటుంది. ఆ సరస్సు పొడవు జోర్డాన్ లోని ఒక నగరం అమ్‌లా నుండి అదన్ వరకు ఉంటుంది. ఆ సరస్సు కు కౌసర్ కాలువ నుండి నీరు సరఫరా అవుతూ ఉంటుంది.

(ఇంకా ఉంది)

telgo NOVEMBER.indd 9 10/20/11 4:02 PM



మిలియనీస్తే నగరం ముక్కోటి

"నిశ్చయంగా మానవుల కొరకు ప్రప్రథమంగా ఖరారు చేయబడిన గృహం బక్కా (మక్కా) లో ఉన్నదే. అది ఎంతో శుభప్రదమైనది. సమస్తలోక వాసులకు మార్గదర్శకం కూడాను. అందులో స్పష్టమైన సూచనలున్నాయి. అందులో ప్రవేశించినవాడు రక్షణ పొందుతాడు. మరియు అక్కడికి వెళ్ళే స్థోమత గలవారికి, ఆ గృహ యాత్ర-హజ్జ్ చేయటాన్ని అల్లాహ్ విధిగా చేశాడు". (ఆలి ఇమ్రాన్: 96,97)

ఈ వచనాలలో కాబా గృహ ఔన్నత్యాన్ని, ప్రాస్తశ్యాన్ని పేర్కొనడం జరిగింది. కాబా గృహానికి సంబంధించిన అయిదు విశిష్ఠతలు వివరించబడ్డాయి.

1) మొదటి దైవ గృహం

పూర్తి భూమండలంపై మొదటి దైవ గృహ గౌరవం కాబాకే దక్కింది. యూదులు భావించి నట్లు **'బైతుల్ మఖ్దిస్'** అన్నిటికన్నా మొదటి ఆరాధనాకేంద్రం కానేకాదు. ఈ విషయమై దైవ ప్రవక్త మహమ్మద్ (స) వారిని ప్రశ్నించి నప్పుడు ఆయన ఇలా సమాధానం ఇచ్చారు:

"భూమండలం మీద మొట్టమొదట నిర్మించ బడిన దైవ గృహమేది? అని అడగ్గా – 'కాబా' అన్నారు. ఆ తర్వాత ఏ గృహం అని ప్రశ్నించ గా – 'మస్జిదె అఖ్సా' అన్నారు. ఈ రెంటికి మధ్య ఎంత కాలం తేడా ఉందని అడగ్గా – '40 సంవత్సరాలు" అని ప్రవక్త (స) బదులి చ్చారు. (బుఖారీ, ముస్లిం)

కొందరు ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం –ఈ గృహాన్ని తొలుత దైవ దూతలు నిర్మిం చారు. తర్వాత ఆది మానవుడైన ప్రవక్త ఆదం (అ) ఈ గృహం మీద డోము కట్టిం చారు. ఆనక అది నూహ్ (అ) గారి కాలంలో వచ్చిన జలప్రళయంలో నేలమట్టం అవగా, తర్వాత దైవ దూత జిబ్రయీల్ (అ) సూచనల మేరకు ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) అవే పునాదు లపై ఈ గృహాన్ని పునర్నిర్మించారు అన్నది. ఏదిఏమైనా ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)గారి నిర్మాణం తర్వాత నుండి మొదలు నేటి వరకు ఆ గృహం ప్రజల్ని ఆకట్టుకుంటూనే ఉంది. నాటి నుండి మొదలు ప్రపంచ ప్రజలు ఆ గృహాన్ని ఉద్దే శ్యించి హజ్జ్ ఉమ్రాలు చేస్తూనే ఉన్నారు.

2) అది ఎంతో శుభప్రదమయినది

సృష్టి మొత్తంలో కేవలం కాబా గృహ చుట్టు ప్రదక్షిణ చేయడం మాత్రమే సమ్మతించ బడింది. ఖుర్ఆన్‌లో ఇలా ఉంది:

"ఆ తర్వాత వారు (దేవుని) ఆ ప్రాచీన గృహా నికి ప్రదక్షిణ చేయాలి". (అల్‌హజ్జ్: 29)

ఈ ఆయతులో ప్రాచీన గృహం అంటే పవిత్ర కాబా గృహమే. కాబా ప్రపంచంలోని ముస్లింలందరి కోసం నమాజు చేసే దిశగా, ప్రదక్షిణ చేసే స్థలంగా ప్రసిద్ధి. ప్రదక్షిణ కేవ లం కాబాకు మాత్రమే ప్రత్యేకం. ఇతర ప్రార్థ నాలయాల వద్ద ప్రదక్షిణ చేయడానికి వీల్లేదు. దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

"భూ మండలంలో కాబా ఎక్కడుందో దానికి నేరుగా ఏడు ఆకాశాలపైన బైతుల్ మామూర్ ఉంది. దానిపైన స్వర్గం ఉంది. స్వర్గ శిఖర భాగమైన ఫిర్‌దౌస్ పైన అల్లాహ్ అర్ష్ ఉంది". (దారమీ)

ప్రాంతం, ప్రదేశ పరంగా ఇటువంటిప్రాశ స్త్యం మరే స్థలానికి లేదు. దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: **"తవాఫ్ చేస్తూ మనిషి వేసే ప్రతి అడుగుకి బదులు పది పుణ్యాలు లిఖించబడతాయి. పది పాపాలు మన్నించ బడతాయి. స్వర్గపు పది అంతస్థులు పెంచబడ తాయి".** (అహ్మద్)

మరో హదీసులో ఇలా ఉంది: **"మస్జిదె హరామ్‌లో ఒక నమాజు చేయడం అనేది ఇతర మస్జిద్‌లలో లక్ష నమాజులు చేసేంతటి పుణ్యానికి సమానం"** అన్నారు ప్రవక్త (స).

(ఇబ్ను మాజా)

"మూడు మస్జిద్‌ల వైపు తప్ప మరే ఇతర చోటుకి పుణ్యఫలాపేక్షతో ప్రయాణం చేయ కూడదు. 1) మస్జిదె హరామ్ (కాబా). 2) మస్జిదె అఖ్సా 3) నా ఈ మస్జిద్ (మస్జిదె నబవీ)" అన్నారు ప్రవక్త (స).

3) అది సమస్తలోకవాసుల కోసం మార్గదర్శక కేంద్రం.

ఖుర్ఆన్‌లో ఇలా ఉంది: **"(జ్ఞాపకం చేసు కోండి) మేము ఈ గృహాన్ని (కాబాను) మాన వులందరి పుణ్యక్షేత్రంగానూ, శాంతి నిలయం గానూ చేశాము".** (అల్ బఖరా: 125)

ఈ ఆయతులో **'మసాబతల్లిన్నాస్'** అంటే పుణ్యక్షేత్రం మరియు మాటిమాటికీ మరలి రావలసిన స్థలం అన్న అర్థం కూడా వస్తుంది. ఈ గృహ విశిష్ఠత ఎట్టిదంటే, ఒకసారి ఈ కాబా గృహాన్ని సందర్శించుకున్నవారు మరో సారి, ఇంకోసారి, మళ్ళింకోసారి కూడా అక్కడి కి రావాలని ఉవ్విళ్ళూరుతుంటారు. అలా ఎన్ని సార్లు సందర్శించుకున్న వారి దాహార్తి తీరదు. అదొక శాంతి నిలయం. అక్కడ శత్రు భయం కూడా ఉండదు.

telgo NOVEMBER.indd 10 10/20/11 4:02 PM

అజ్ఞాన కాలంలో సయితం ప్రజలు ఆ పుణ్య క్షేత్రం పరిధిలో శత్రువును, స్వయాన తండ్రిని చంపిన హంతకుణ్ణి సయితం సంహరించే వారు కాదు.

ఇక్కడ మనకు ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) గారి దుఆ గుర్తుకొస్తుంది. ఆయన దైవాన్ని ఇలా వేడుకున్నారు: **"నా ప్రభూ! ఈ నగరాన్ని శాంతిభద్రతలు గల నగరంగా చేయి. నన్నూ, నా సంతానాన్ని విగ్రహ పూజ నుంచి కాపాడు".** (ఇబ్రాహీమ్: 35)

పై ఆయతులో **'ఈ నగరం'** అంటే మక్కా అని భావం. ఇతరత్రా విషయాలను అర్థించే ముందు ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) మక్కా నగరాన్ని శాంతియుతంగా ఉంచమని అర్థించటం విశేషం! ఎందుకంటే నగరంలో ప్రశాంత పరిస్థితులు నెలకొని ఉన్నప్పుడే ప్రజలు దైవానుగ్రహాలలోని మాధుర్యాన్ని ఆస్వాదించ గలుగుతారు. శాంతి, సుస్థిరతలు కొరవడిన చోట మనిషికి ఎన్ని కానుకలు, లాభాలు, పురస్కారాలు ప్రాప్తించినా అవి రుచించవు. అశాంతి అలజడుల వాతావరణంలో మనిషి క్షణం క్షణం భయాందోళన చెందుతూ ఉంటాడు. నేడు ప్రపంచంలో వివిధ సమాజాలను, వివిధ ప్రదేశాలను పరికిస్తే ఈ సంగతి అర్థమవుతుంది. అయితే మక్కాలోని పరిస్థితి దీనికి భిన్నంగా కనిపిస్తుంది. ఇది దేవుని అనుగ్రహం తర్వాత ప్రవక్తల పితామహుడు ఇబ్రాహీమ్(అ) చేసిన ప్రార్థనా ఫలితమే. నేటి దౌర్భాగ్య స్థితిలో సయితం సమస్త మానవాళికి శాంతి సందేశాన్ని అందజేస్తున్న ఏకైక కేంద్రం మక్కా. ఇటువంటి పవిత్ర ప్రదేశం, ప్రశాంత ప్రాంతం ప్రపంచమంతటిలో లేదంటే అతిశయోక్తి ఎంత మాత్రం కాదు.

తర్వాత ఇబ్రాహీమ్ (అ) చేసిన దుఆను గమనిస్తే-, ఆయన (అ) ఇలా ప్రార్థించారు: **"మా ప్రభూ! నా సంతానంలో కొందరిని ఎలాంటి పంటలు పండని కటిక లోయలో నీ పవిత్ర గృహం వద్ద వసింపజేశాను. మా ప్రభూ! వారు నమాజును నెలకోల్పేందుకు (ఇక్కడ వదలి పెట్టాను). కనుక ప్రజల్లోని కొందరి హృదయాలు వారి వైపు మొగ్గేలా చేయి. వారికి తినడానికి పండ్లు ఫలాలను ప్రసాదించు. వారు కృతజ్ఞులుగా మెలిగేందుకు".** (ఇబ్రాహీమ్: 37)

అది ప్రపంచ ప్రజలందరికీ మార్గదర్శక కేంద్రం ఎలా అయిందో మీరే చూడండి! ప్రపంచ నలు మూలల నుంచి ముస్లింలు ఎలా భక్తిప్రపత్తులతో మక్కా వైపుకు తరలి వస్తున్నారో! ఒక్క హజ్జ్ సీజన్‌లోనే కాదు, ఏడాది మొత్తం వారు వస్తూనే ఉంటారు. ఏడాదిలోని అన్ని నెలల్లోనూ, అన్ని వారాల్లోనూ, అన్నీ రోజుల్లోనూ, అన్నీ గంటల్లోనూ, అన్నీ ఘడియల్లోనూ కాబా గృహం భక్తుల ప్రదక్షిణలతో కళకళలాడుతూ నిండు వసంతాన్ని, భూతల స్వర్గాన్ని తలపిస్తూ ఉంటుంది. అలాగే ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) చేసిన ప్రార్థనలో పండ్లు, ఫలాల ప్రస్తావన కూడా ఉంది. అంటే- ఒక మనిషి జీవికకు శాంతి భద్రతలు ఎంత అవసరమో పుష్కలమైన జీవనోపాధి అంతే అవసరం. అల్లాహ్ ఆయన (అ) మొరను ఆలకించాడు. మీరే గమనించండి! నీరూ, పచ్చికా లేని ఆ కొండ ప్రాంతంలో నేడు విశ్వమంతటి నుంచి రకరకాల పండ్లు, కూరగాయలు పుష్కలంగా వచ్చి పడుతున్నాయి. హజ్జ్ సీజన్‌లోనూ, రమజాన్ మాసంలోనూ అక్కడికి వచ్చే భక్తుల సంఖ్య లక్షలు దాటి కోటికి చేరుతున్నా ఆహార సరఫరాలలో ఎలాంటి కొరతా ఏర్పడదు. ఇటువంటి మహిమాన్విత నగరం మక్కా పురం మినహా లోకం మొత్తంలో మరొకటి ఉందా?

4) అందులో స్పష్టమైన నిదర్శనాలున్నాయి.

జమ్‌జమ్ జల బావి. మకామె ఇబ్రాహీమ్. సఫామర్వాల మధ్య సయీ, హజ్రె అస్వద్ మొదలైనవి.

మకామె ఇబ్రాహీమ్:

"మీరు ఇబ్రాహీము నిలబడిన **(మకామె ఇబ్రాహీమ్)** ప్రదేశాన్ని ప్రార్థనా స్థలంగా చేసుకోండి". (అల్ బఖరా: 125)



మకామె ఇబ్రాహీమ్ అన్నది ఒక రాయి. ఈబ్రాహీమ్ (అ) ఆ రాతి మీదే నిలబడి కాబా గృహాన్ని నిర్మించారు. ఆ రాయిపై ఆయన పాద చిహ్నాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఆ రాయి ఒక అద్దాల కేసులో సురక్షితంగా ఉంచబడింది. హజ్జ్-ఉమ్రాకు వేళ్ళే ప్రతి ఒక్కరూ కాబా ప్రదక్షిణ సందర్భంగా దాన్ని చూడవచ్చు. కాబా ప్రదక్షిణ పూర్తయ్యాక ఆ స్థలం లోరెండు రకాతుల నమాజు చేయటం ప్రవక్త (స) వారి సంప్రదాయం - సున్నత్.


సఫా-మర్వా:

"నిశ్చయంగా సఫా మర్వాలు అల్లాహ్ చిహ్నాల లోనివి".(బఖరా: 158) హాజ్రత్ హాజిరా (అ) వారి నిరుపమాన త్యాగానికి గుర్తు సఫా మర్వాల మధ్య సయీ.



3) హజ్రె అస్వద్

ఇది స్వర్గం నుండి దించబడిన ఒక రాయి. ఇది ముందు పాలకన్నా తెల్లగా ఉండేది, తర్వాత మనిషి పాప మసితో నల్లబడింది అన్నది మేధావుల మాట. ఈ రాయిని ప్రేమగా తాకడం, ముద్దాడటం సున్నత్. ఈ రాయి ఎవరికి ఏ విధమైనటువంటి లాభం గానీ, నష్టంగానీ చేకూర్చజాలదు.



ముస్లిం మక్కా వెళ్ళి ఈ రాయిని పూజిస్తారన్న మాట పూర్తి అవాస్తవంతో కూడినది. ఈ రాయిని శుభప్రదంగా భావించి ఈరాన్ దేశస్థులు తమతోపాటు పట్టుకెళ్ళి 20 సంవత్సరాలు తమ వద్దే పెట్టుకున్నారు. అప్పుడు కూడా హజ్జ్‌ఉమ్రాలు జరుగుతూనే ఉన్నాయి. అలాగే అజ్ఞాన కాలంలో సయితం కాబాలో గల 360 విగ్రహాల్ని పూజించే సమయంలో సయితం ఈ రాయిని కొలచినట్టు ఆధారాలు లేవు. అదే విధంగా తర్వాతి కాలంలో చోటు చేసుకున్న దండయాత్రల కారణంగా ఈ రాయి ముక్కలయిపోయింది. ప్రస్తుతం అది ఎనిమిది ముక్కలుగా మరో పెద్ద రాయిలో అమర్చబడి ఉంది.

5) అందులో ప్రవేశించిన వ్యక్తి రక్షణ పొందుతాడు.

అంటే, అది మార్గదర్శక కేంద్రమే కాదు, పుణ్యక్షేత్రమే కాదు, రక్షణ కేంద్రం కూడా. ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

"గౌరవప్రద గృహమైన 'కాబా'ను అల్లాహ్ మానవాళి మనుగడకు సాధనంగా చేశాడు". (అల్ మాయిదా: 97)

'ఖియామల్లిన్నాసి'లో మానవులు అంటే, పూర్వపు ప్రజలు, ప్రస్తుతం ఉన్నవారు, ప్రళయం వరకూ వచ్చే జనులందరు అన్న అర్థం ఒకటి. **(మిగతాది 15వ పేజీలో)**

telgo NOVEMBER.indd 11 10/20/11 4:02 PM

సయ్యద్ అబ్దుస్సలాం ఉఫీ
abdussalamsyed@ymail.com

నబీ (స) వారు నవ్విన వేళ

నబీ (స) వారు ఇలా ప్రబోధించారు: "ఏ మంచి పనినీ అల్పంగా భావించకండి. మీ సోదరుణ్ణి నగుమోముతో నవ్వుతూ పలకరించటాన్నయినా సరే" (ముస్లిం)

మృదుత్వం, ప్రేమ, అణకువ, ఆప్యాయత, అనురాగం–ఇలాంటి ఇతర నైతిక విలువలు ప్రజల మధ్య చాలా అవసరం. ఇవి లేకుంటే ప్రజలు మనల్ని అభిమానించరు. దగ్గరికి రావడానికి ఇష్టపడరు. సుపరిచితులైనా, అపరిచితులైనా ప్రతి ఒక్కరితో నవ్వుతూ మాట్లాడటం మనందరి నైతిక ధర్మంగా ఎంచాలి. సాధారణంగా మనం దానికి అంతగా ప్రాధాన్యతనివ్వకపోవచ్చు. కానీ నైతికంగా అది చాలా గొప్ప గుణం. ఎదుటి వ్యక్తి పట్ల మనకున్న ప్రేమాభిమానాలను వ్యక్తం చేసుకునే విధానం. అందుకే ప్రియ ప్రవక్త (స) దానికి అంతటి ప్రాధాన్యతను ఇవ్వడంతో పాటు దాన్నో పుణ్యకార్యంగా పేర్కొన్నారు: **"నీ సోదరునితో నీ నగుమోము సంభాషణ కూడా పుణ్యకార్యమే".** స్వయంగా ప్రవక్త (స) వారి పట్ల ఆయన సహచరుల అభిప్రాయమేమి టంటే – మాలోని ఎవరైనా సరే ఆయన వైపు గనక చూస్తే ఆయన నగుమోముతో పలకరించే వారు. ఈ కారణంగా మాలోని ప్రతి వ్యక్తి, **'ప్రవక్త (స) అందరికన్నా అధికంగా తననే ప్రేమిస్తున్నారు'** అన్న సద్భావంతో ఉండేవాడు. రండీ! మన ప్రియ ప్రవక్త (స) వారిని నవ్వించేలా చేసిన ఆ మందస్మిత స్మృతుల్ని నెమరువేసుకుందాం!!

దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"ప్రవక్తా! మృదుత్వం, మన్నింపుల వైఖరిని అవలంబించు. మంచిని ప్రబోధించు. మూర్ఖులతో చూసిచూడనట్టుగా ప్రవర్తించు".** (అల్ ఆరాఫ్: 199)

హజ్రత్ అనస్ (ర) కథనం – నేనోసారి నబీ (స) వారి వెంట నడుస్తున్నాను. ఆ సమయంలో ఆయన దళసరి అంచులు గల నజ్రాన్ దుప్పటి కప్పుకొని ఉన్నారు. దారి మధ్యలో ఓ పల్లెటూరి మొరటు వ్యక్తి కలిసి ఆయన ఉప్పటి పట్టుకొని గట్టిగా లాగాడు. నేను నబీ (స) వారి భుజం వంక చూశాను. గట్టిగా లాగడం వల్ల దుప్పటి అంచులు గీసుకు పోయి ఆయన భుజం కందిపోయివుంది. ఆ పల్లెటూరి వ్యక్తి అంతటితో ఊరుకోక, **'అల్లాహ్ నీకిచ్చిన సొమ్ములో నుంచి నాక్కొంచెం ఇప్పించు!'** అని కాస్త కటువుగానే అడిగాడు. దానికి నబీ (స) వారు అతని వైపు తిరిగి చూసి **'నవ్వుతూ'** ఇతనికి కొంత ధనం ఇవ్వండి" అని సహచరుల్ని ఆజ్ఞాపించారు. (బుఖారీ, ముస్లిం)

ఓ సందర్భాన ఆయన ఇలా అన్నారు: 'కుస్తీ పట్టి మల్ల యుద్ధంలో ఇతరులను చిత్తు చేసేవాడు పహిల్వాను కాడు. కోపం వచ్చినప్పుడు తనను తాను నిగ్రహించుకొని తన కోపాన్ని అదుపులో ఉంచుకో (కమించ) గలిగేవాడే నిజమైన బలశాలి". (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూ అమ్ర్ జరీర్ బిన్ అబ్దుల్లాహ్ (ర) గారి కథనం – ఒక రోజు మిట్ట మధ్యాహ్నం మేము నబీ (స) వారి పవిత్ర సన్నిధిలో ఉండగా కొంత మంది వచ్చారు. వారి ఒంటి మీద సరిగ్గా బట్టలు కూడా లేవు. గళ్ల దుప్పటి లేక కంబళ్లు చుట్టుకొని ఉన్నారు. వాళ్లలో చాలా మంది, చాలా మందేమిటి దాదాపు అందరూ **'ముజర్'** తెగకు చెందిన వాళ్లే. వారి పస్తుల స్థితి చూసి నబీ (స) వారు చలించిపోయారు. ఆయన (స) ముఖారవిందం కమిలిపోయింది. ఆయన తన కుటీరంలోనికి వెళ్ళి తిరిగి బయటికొచ్చారు. అజాన్ ఇవ్వమని హజ్రత్ బిలాల్



(ర)ను ఆదేశించారు. బిలాల్ (ర) అజాన్ ఇచ్చి (ప్రజలు నమాజు కోసం హాజరైన తర్వాత) ఇఖామత్ పలికారు. నబీ (స) వారు నమాజు చేయించిన తర్వాత ప్రజల ముందు ఉపన్యసిస్తూ ఇలా అన్నారు: **"ప్రజలారా! మిమ్మలందర్నీ ఒకే ప్రాణి నుంచి పుట్టించిన మీ ఆ ప్రభువుకు భయ పడండి.....అల్లాహ్ మిమ్మల్ని గమనిస్తున్నాడనే విషయాన్ని విస్మరించకండి".** (నిసా:1) తరువాత సూరయె హష్ర్‌లోని ఆయతులు పఠించారు: **"విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి. ప్రతి వ్యక్తీ తాను రేపటి కోసం ఏమి సమకూర్చుకున్నాడో చూసుకోవాలి".**

ఆ తర్వాత ప్రజల్ని దానధర్మాలు చేయమని ప్రోత్సహించారు. ప్రతి వ్యక్తీ తన దీనారు నుండి, తన దిర్హము నుండి, తన బట్టల నుండి, ఇంకా గోధుమలు 'సా' (కొలిచే ఒక ప్రమాణం) నుంచి, ఖర్జూరాల 'సా' నుంచి దానం చేయాలన్నారు. అంతే కాదు. ఒక్క ఖర్జూరపు ముక్కయినా సరే దానం చేయాలని పురిగొల్పారు.

అప్పుడు అన్సార్లలోని ఒకతను ఒక నిండు బస్తా తీసుకొచ్చాడు. అతని చేయి ఆ బస్తాను మోయలేనట్టుగా ఉంది. (కొంత దూరం వచ్చాక) సాధ్యం కాలేకపోయింది. ఆ తర్వాత ప్రజలు ఒకర్ని చూసి మరొకరు దానాలు చేస్తూ పోయారు. నేను చూస్తుండగానే అక్కడ రెండు రాసులు తయారయ్యాయి. వాటిలో ఒకటి తినే వస్తువులది. రెండోది బట్టలది. అది చూసి **నబీ (స) వారి ముఖారవిందం మేలిమి బంగారపు ముక్కలా మెరుస్తుండటం** నేను గమనించాను.

తరువాత నబీ (స) వారు ఇలా ఉద్బోధించారు: **"ఎవడైనా ఇస్లాంలో ఒక మంచి పనిని మొదలు పెడితే అతనికి తన పుణ్యం లభిస్తుంది. ఇంకా అతని తర్వాత దానిని ఆచరించేవారి పుణ్యం కూడా లభిస్తుంది. దాని వల్ల వారికి లభించే పుణ్యంలో ఎలాంటి కొరతా ఏర్పడు. దీనికి విరుద్ధంగా ఇస్లాంలో ఎవడైనా ఏదైనా చెడ్డ పని ప్రారం భిస్తే అతనిపై దాని పాపభారం పడుతుంది. ఇంకా అతని తర్వాత దానిని అమలు చేసేవారందరి పాపం కూడా అతని నెత్తి మీద పడుతుంది. అయితే దీని వల్ల వారిపై పడే పాపభారం ఏ మాత్రం తగ్గింపు ఉండదు".**

(ముస్లిం)

telgo NOVEMBER.indd 12 10/20/11 4:02 PM

తరచూ నబీ (స) వారు ఇలా అంటూ ఉండేవారు: **"సౌలభ్యాన్ని కలుగజేయండి. ప్రజలను కాఠిన్యానికి గురి చేయకండి. శుభవార్తలు అందించండి. ద్వేషాన్ని రగిలించే మాటలు అనకండి".** (బుఖారీ)

ప్రజలకు నీతిని, నడవడికను బోధించేటప్పుడు వారి పట్ల వీలైనంత వరకు మృదుత్వం మన్నింపుల వైఖరిని అవలంబించాలన్నది నబీ (స) వారి అభిలాష. ఎందుకంటే, కాఠిన్యం, కరకుదనాల వల్ల వారు బెదిరి పోయి నకారాత్మకంగా స్పందించే ప్రమాదం ఉంది.

హజ్రత్ అబూ హురైరా (ర) గారి కథనం – ఒకతను నబీ (స) వారి సన్నిధికి వచ్చి: 'నేను నాశనమైపోయాను ప్రవక్తా!' అన్నాడు. నబీ (స) వారు అది విని **"ఏం చేశావు ఏమిటి?"** అన్నారు. 'నేను పర్జ్ ఉపవాస స్థితిలో నా భార్యతో సంబోగించాను' అని చెప్పాడు. అప్పుడు నబీ (స) వారు **"అయితే నువ్వు ఒక బానిసకు స్వేచ్ఛనివ్వగలవా?"** అని అడిగారు. దానికా వ్యక్తి 'ఇవ్వలేను' అన్నాడు. **"మరి ఎడతెరిపి లేకుండా రెండు మాసాలపాటు ఉపవాసముండగలవా?"** అని ప్రశ్నించారు. దానికా వ్యక్తి 'ఉండలేను' అని సమాధానమిచ్చాడు. **"పోని అరవై మంది నిరుపేదలకు అన్న దానం చేయగలవా?"** అని మళ్ళి ప్రశ్నించారు నబీ (స) వారు. 'అదీ సాధ్యపడదు' అన్నాడా వ్యక్తి.

ఆ తర్వాత కాసేపటికి నబీ (స) దగ్గరకు ఎవరో ఓ ఖర్జూర పండ్ల తట్ట తెచ్చారు. నబీ (స) వారు దాన్ని ఆ వ్యక్తికి చూపిస్తూ **"వీటిని తీసుకెళ్ళి నీ తరఫున నిరుపేదలకు దానం చెయ్యి"** అని పుమాయించారు. అందుకా వ్యక్తి 'ఓ నబీ నాయకా! (స) నాకంటే నిష్ఠ దరిద్రులు తమరికి తెలియకుండా ఎవరున్నారు? దైవం సాక్షి! మదీనా ఇరువైపు ఉన్న రాతి నేల ప్రదేశాల్లో నా ఇంటికన్నా నిరుపేదలు మరెవరూ లేరు' అని విన్నవించుకున్నాడు. అది విన్న నబీ (స) వారు పెద్దగా **నవ్వేశారు.** ఆయన మునుపటి పల్లు ముత్యాల్లా మెరుస్తూ కన్పించాయి. ఆ తర్వాత **"సరే, నువ్వే తీసుకెళ్ళి నీ ఇంటివారికి తినిపించు"** అన్నారు. (బుఖారీ)

నబీ (స) వారు చివరిసారిగా మంచాన పడ్డ సమయం అది. హజ్రత్ అబూబకర్ (ర) ఆ సమయంలో ముందు నిలబడి నమాజు చేయిస్తున్నారు. మస్జిద్‌లో అనుచరులంతా ఫజ్ర్ నమాజులో లీనమై ఉన్నారు. కిటికీపై పడి ఉన్న పరదాను తొలగించి చూశారు. తాను ఆశీమచిన శాంతి సమాజం దేవుని పుడమిపై ఆవిర్భవించిందని తలచి ఆయన తృప్తిగా శ్వాస పీల్చుకున్నారు. అప్పుడు ఆయన ముఖారవిందం తెరచిన పుస్తకంలోనీ తెల్ల కాగితం వలే నిగనిగలాడుతోంది. తన బోధనలకు సజీవ ఉదాహరణగా రూపొందిన దైవ దాసుల భక్తీశ్రద్ధలను చూసి ఆయన హృదయం ఆనందంతో ఉప్పొంగింది. అదే ఆనందం ఆయన వదనంపై కదలాడింది. **నబీ (స) వారు నవ్వారు.** కిటికీ దగ్గర ఆయన అలికిడి విని కాస్త ఆలోచనలో పడ్డారు సహచరులు. నబీ (స) వారి రాకతో సంతోషించిన సహబా, బహుశా నబీ (స) వారు మస్జిద్‌లోకి వస్తారేమోనని భావించి అబూ బకర్ (ర) గారిని వెనక సఫ్ (పంక్తి)లో వచ్చి నిలబడవలసిందిగా సైగ చేయనారంభించారు. అది గమనించిన నబీ (స) వారు సైగతో వారించి మీ నమాజు మీరు పూర్తి చేయండని కిటికీ తెర దించేశారు.

నబీ (స) వారి మనస్సు శాంతి సంతృప్తులతో నిండిపోయింది. తనపై ఆ విశ్వ ప్రభువు మోపిన బరువుబాధ్యతలు తీరిపోయినందుకు ఆయన పరమానంద భరితులయ్యారు.

కీర్తిశేషుల దృష్టిలో కులం

(5వ పేజీ మిగతా భాగం)

ఇస్లాం అంటే కేవలం ముహమ్మద్ నబీ మతం అనుకోకండి. దైవ ప్రవక్తలందరూ ప్రబోధించిన జీవన విధానం ఇదే. ఇస్లాం అంటే లుంగీలు కట్టుకునేవాళ్లు, గడ్డాలు పెంచేవాళ్లు, సాయిబులూ, రైతార్లు, మరక్కయార్ మప్పిళ్లల మతం అనుకోకండి. ఇస్లాం అనేది శాంతి, సుగుణం, అంకిత భావం అనే అర్థం వచ్చే అరబీ పదం. ఇస్లాం అంటే సహోదర భావం అంతే. రెండు మూడు వందల సంవత్సరాల కిందటి నిఘంటువులను తిరగేసి చూడండి. అరబిక్‌లో కాకపోతే మరో భాషలో దానిని ప్రస్తావించండి. ఒకే దేవుడు, అదీ భౌతిక రూప రహితుడైన దేవుడు. శాంతి, సమైక్యత, పర్సపర గౌరవం, ప్రేమభావం, భక్తీప్రపత్తులు ఈ ధర్మ లక్షణాలు. ద్రావిడంలో కడవుల్, ఆంగ్లంలో గాడ్, అరబిక్‌లో అల్లాహ్. మనకు తెలియని దేవుడో, సిద్ధాంతమో కాదిది. ఒంటికి పూసుకున్న బూడిదను బట్టి, నుదుటి మీద నామాలను బట్టి, గుండ మీద పిలకను బట్టి ఇతర మతాలను గుర్తించినట్టు ఇస్లాంని కూడా గుండునీ, గడ్డాన్నీ లేదా లుంగీని బట్టి గుర్తించొద్దు. ఈ దేశంలోని ముస్లింలే మొత్తం ఇస్లాంకు ఏకైక గుత్తాధిపతులేం కాదు. ఒకటి మాత్రం నిజం–ముస్లింలు వారు ఏ దేశానికి చెందిన వారైనా, ఏ భాష మాట్లాడేవారైనా, ఏ రూపురంగు గలవారైనా వారందరికీ ఒక్కడే దేవుడు. ఆ దేవుడికి భౌతిక రూపం లేదు. భార్యా పిల్లలు లేరు. తల్లిదండ్రులు లేరు. ఆయనకు సరి సమానమై నది, సరిపోలిన వస్తువేది ఈ జగాన లేదు. ఆయన భూమిపై సంచరించే సకల జీవరాసుల ఉపాధి ప్రదాత. మిమ్మల్ని అన్న పానీయాలు వజ్రవైఢూర్యాలేమీ అడగడు. ముస్లింలలో సహోదరత్వం, సమాన హక్కులు, క్రమశిక్షణ అంతటా ఒకేలా ఉంటాయి. మిగతా అంశాలు ఆయా దేశాల సాంప్రదాయాలపై ఆధారపడి ఉంటాయి. అంతటా ఉన్న ఉమ్మడి అంశాల కారణంగానే ప్రపంచంలోని విభిన్న ప్రాంతాల్లో నివసిస్తున్న అరవై (నేడు 150) కోట్ల మంది ప్రజల మధ్య సహోదరత్వం కొనసాగుతోంది.

ఓ నా ప్రియమైన సోదరులారా! ఇందుకు ఇస్లాం కాక ఇతర ప్రత్యామ్నాయ పరిష్కారమేదైనా ఉంటే చెప్పండి. ఇప్పటికి ప్పుడే చెప్పనవసరం లేదు. ఇంటికెళ్ళి తాపీగా పండితులని, ఆయ్యవార్లని, మేధావులని, న్యాయవాదులని, ఇంకా బడా అధికారులని కలవండి. వాళ్ళతో సునిశితంగా చర్చించండి. ఆ తర్వాత మీరో నిర్ణయానికి రండి. ఇంత వరకూ ఎంతో ఓపికగా నా మాటలు విన్నందుకు మీకు వంద సలాములు.

('పెరియార్ దృష్టిలో ఇస్లాం' పుస్తకం నుంచి)

telgo NOVEMBER.indd 13 10/20/11 4:03 PM



ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

ముస్లిం జీవితానికి సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలు



ప్రశ్న: బ్రతికి ఉన్న వారిని సహాయం కోరటం, సిఫారసు కోసం అడగటం సమ్మతమేనా?

జ: అవును, సమ్మతమే. ఇతరులకు సహాయపడమని ఇస్లామీయ షరీఅత్ ప్రోత్సహించింది. అల్లాహ్ ఈ విధంగా ఆజ్ఞాపించాడు: **"సత్కార్యాలలో, దైవ భీతితో కూడిన విషయాలలో ఒండొకరికి తోడ్పడుతూ ఉండండి".** (అల్‌మాయిద-2)

మహనీయ ముహమ్మద్(స) ఇలా ప్రవచించారు: **"దాసుడు తన సోదరునికి తోడ్పడుతూ ఉన్నంత సేపు అల్లాహ్ అతని తోడ్పాటులో ఉంటాడు".** (ముస్లిం)

ఇక సిఫారసు వ్యవహారానికొస్తే అది ఎంతో మహత్వపూర్వకమైనది. సిఫారసు కోసం ఎవరయినా అభ్యర్థించినపుడు, వారి వ్యవహారంలో కల్పించుకుని సిఫారసు చేయటం **'షఫాఅతె వాస్తా'** అనబడుతుంది. ఈ విషయంలో ఉన్న దైవో పదేశమేమిటో గమనించండి :

"ఎవరయినా ఒక మంచి పని కోసం సిఫారసు చేస్తే అతనికి కూడా అందు లో కొంతభాగం లభిస్తుంది".(అన్‌నిసా -85)

"సిఫారసు చేయండి, ప్రతిఫలం పొందుతారు" (బుఖారీ) అని ప్రవక్త మహ నీయులు (స) ప్రేరేపించారు.

ఈ సిఫారసు సమ్మతమే. అయితే కొన్ని షరతులకు లోబడి :

(1)సిఫారసు కోసం జీవించి ఉన్న వారినే కోరాలి. ఎందుకంటే మృతుడు తనస్వయానికే లాభం చేకూర్చుకోలేక పోయినపుడు ఇతరులకు ఎలా లాభం చేకూర్చ గలడు?

(2) సిఫారసు కోసం మనం ఎవరిని అడుగుతున్నామో వారు మన విన్నపాన్ని అర్థం చేసుకోగలవారై ఉండాలి.

(3) మనం దేని కోసం సిఫారసు చేయమని అంటున్నామో ఆ వస్తువు ఉండాలి.

(4) మనం కోరే ఆ వస్తువును మానవ మాత్రుడు ఇప్పించగలిగి ఉండాలి.

(5) ఆ వస్తువు ప్రాపంచిక వ్యవహారాలకు సంబంధించినదై ఉండాలి.

(6) అది ధర్మసమ్మతమైనదై ఉండాలి. దాన్ని మనం పొందటం వల్ల ఇతరులకు నష్టం వాటిల్లకూడదు.

ప్రశ్న: వసీల ఎన్ని రకాలు?

జ: వసీల రెండు రకాలు-

(1) సమ్మతమైన వసీలా (2) సమ్మతం కాని వసీలా.

సమ్మతమైన వసీలా కూడా మూడు విధాలుగా ఉంటుంది. ఒకటి: అల్లాహ్ నామాల, గుణగణాల ఆధారంగా అభ్యర్థించటం. రెండవది: తాము చేసుకున్న ఏదేని మంచిపని ఆధారంగా వేడుకోవటం- ముగ్గురు గుహవాళ్ళ గాధ మనకు తెలిసిందే.

మూడవది: ఎవరయినా సజీవుడైన ముస్లిం పుణ్యపురుషుని దుఆను 'వసీలా'(ఆధారం)గా చేసుకోవటం.

సమ్మతం కాని వసీలా: ఇది రెండు విధాలు.

ఒకటి: దైవప్రవక్త(స) లేదా మరెవరయినా సత్పురుషుని ఉన్నత స్థానాన్ని ఆస రాగా చేసుకుని దైవసహాయాన్ని అర్థించటం. ఉదాహరణకు:- ఓ అల్లాహ్! నేను నిన్ను నీ ప్రవక్త(స) ఔన్నత్యం ఆధారంగా లేదా హజ్రత్ హుసైన్(ర) అంతస్తు ఆధారంగా వేడుకుంటున్నాను అని అనటం. దైవప్రవక్త (స), దైవ సన్నిధిలో గొప్ప స్థానమున్న సంగతి వాస్తవమే. అలాగే దేవుని సన్నిధిలో పుణ్యపురుషుల స్థానం కూడా గొప్పదే. అయితే దైవసన్నిధిలో మేలును కోరటంలో అందరికంటే అత్యుత్తమ శ్రేణికి చెందిన ప్రవక్త ప్రియసహచరులు ఎన్నడూ ఈ విధంగా చేయలేదు. వారి కాలంలో కరువుకాటకాలు సంభవించినపుడు వారు (సహాబా-రజి) దైవ ప్రవక్త(స) వసీలాను ఆశ్రయించలేదు. మరి చూడబోతే ప్రవక్త(స) వారిసమాధి వారికి చేరువలోనే ఉండేది. పైగా వారు ప్రవక్త పినతండ్రి అయిన హజ్రత్ అబ్బాస్ (ర) చేత దుఆ చేయించారు - అప్పటికి ఆయన జీవించి ఉన్నారు గనక.

రెండవది: దాసుడు దైవ ప్రవక్త(స) లేదా దేవుని ఏ ప్రియదాసునిపై ఒట్టువేసి తన కోర్కెను వెలిబుచ్చటం. ఉదాహరణకు : ఓ అల్లాహ్! నేను నీ ఫలానా ప్రియతముని ఆధారంగా లేదా ఫలానా ప్రవక్త తెచ్చిన సత్యం ఆధారంగా నీకు దరఖాస్తు చేసుకుంటున్నాను.

ప్రశ్న: మృతులను గానీ, గైర్హాజరు వ్యక్తులను గానీ మొరపెట్టుకోవటం ఎటువంటిది?

జ: మృతులను గానీ, హాజరుకాని వ్యక్తులను గానీ మొరపెట్టుకోవటం షిర్క్ ఎందుకంటే దుఆ (ప్రార్థన, వేడుకోలు) అనేది ఒక్క అల్లాహ్‌కే ప్రత్యేకం. అది ఆయన హక్కు. అల్లాహ్ ఉపదేశించాడు: **"ఆయన్ని వదలి మీరు ఎవరెవరిని పిలుస్తున్నారో వారు ఖర్జూరపు టెంకపై ఉండే పొరకు కూడా యజమానులు కారు. ఒక వేళ మీరు వారిని మొరపెట్టుకున్నా, వారు మీ మొరను ఆలకించరు. ఒకవేళ ఆలకించి నా మీ అక్కరను తీర్చలేరు. పైపెచ్చా ప్రళయదినాన మీరు కల్పించే భాగస్వామ్యాన్ని(షిర్క్‌ను) వారు త్రోసిపుచ్చుతారు."** (ఫాతిర్- 13,14)

మహాప్రవక్త(స) ఇలా ప్రవచించారు:

"ఎవడు అల్లాహ్‌ను కాకుండా వేరొకరిని మొరపెట్టుకుంటూ ఉన్నస్థితిలో చస్తాడో అతడు నరకానికి పోతాడు". (బుఖారీ)

మృతుడు స్వయంగా సజీవుల ప్రార్థనల (దుఆల) ఆధారపడి ఉండగా అతన్ని ఏదన్నా అడగగలం? అదీగాక, అతని మరణంతోనే అతని సత్కర్మల పరంపర తెగిపోయింది. బ్రతికి ఉన్నవారి కర్మలు మాత్రం కొనసాగుతూ ఉంటాయి. మృతుని మన్నింపు కోసం సజీవులు ప్రార్థించినపుడు అతడు సంతోషిస్తాడు. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే మృతుడు స్వయంగా వేరొకరిపై ఆధారపడి ఉన్నాడు. అలాంటప్పుడు అతన్ని మొరపెట్టుకోవటం ఎంతవరకు సబబు? ఒక వేళ మొరపెట్టుకున్నా ఆలకించలేనివాడు. దానికి ఎలా స్పందించ గలడు?

telgo NOVEMBER.indd 14 10/20/11 4:04 PM

ప్రవక్త (స) వారి ప్రవచనాల నీడలో

దైవప్రవక్త (స) ఇలా భోధించారు: నీవు ఎక్కడ ఉన్నా దేవునికి భయపడుతూ జీవించు. చెడుకు వెనువెంటనే మంచిని చేసి దాన్ని నిర్మూలించు. ప్రజల పట్ల సద్వర్తనతో వ్యవహరించు.

మనం ఇతరులను కష్టాల్లో ఆదుకోవాలి. వారి బాధను మన బాధగా భావించాలి. ఈ సానుభూతి, దయాగుణాలు బాధాగ్రస్తుడైన ప్రతి వ్యక్తి పట్ల వ్యక్తమవ్వాలి. తనవారైనా, పరాయి వారైనా, ఏ మతంవారైనా, ఏ జాతి వారైనా అందరి పట్ల సానుభూతితో వ్యవహరిస్తూ వారి బాధల్లో పాలుపంచుకోవాలి. ఆకలిగొన్న వారికి అన్నం పెట్టాలి. రోగిని పరామర్శించడం, రోగికి సేవచేయడం. వంటి పనులు చేపట్టాలి.

ఎవరు తన మనస్సును దేవునికి విధేయంగా చేసి, మరణానంతర జీవితం కోసం సదాచరణ చేస్తారో వారు వివేకవంతులు. ఎవరైతే తమ మనోకాంక్షలకు దాసుడై దేవుని విషయంలో తప్పుడు ఆశలు పెట్టుకుంటారో అవివేకులు. మరణం అంటే జీవితం అంతమయిపోవడమని అర్థం కాదు. మరణం అంటే క్రియాలోకంలో నుంచి పరిణామ ప్రపంచంలోనికి ప్రవేశించడం అని అర్థం. కాబట్టి తమ దృష్టిని సత్పరిణామాల మీద ఉంచి దాని ప్రకారం తమ వైఖరిని చక్కదిద్దుకునే వారు వివేకవంతులు.

అపకారానికి ఉపకారం

బంధుత్వ సంబంధాలను పటిష్టం చేసే వ్యక్తి కేవలం ఇతరులు అలా చేసినందుకు తానూ అలా చేస్తే అది సంబంధాల పటిష్ఠత అనిపించుకోదు. తన పట్ల సంబంధాలను తెంచుకునేవారి విషయంలో సంబంధాలను మెరుగు పరిచే వాడే నిజమయిన బంధుత్వ బాధ్యతల్ని నిర్వర్తించేవాడు. మనిషికి తన బాధ్యతలు గుర్తుండాలి. తన విధుల్ని నిర్వర్తించేందుకు సదా ప్రయత్నిస్తూ ఉండాలి. ఇతర బంధువులు తమ బాధ్యతను గ్రహించినా, గ్రహించకపోయినా, తన బంధువుల కున్న హక్కుల్ని అందజేసినా, చేయకపోయినా తాను తన బాధ్యతలని మాత్రం విస్మరించరాదు. ఇతరులు తమ పట్ల బాధ్యతలు నిర్వర్తించినప్పుడు, ఉపకారానికి ఉపకారం చేయడంలో మానవుని గొప్పతనం లేదు. ఇతరులు తన హక్కులు అందజేయకపోయినా దూరం ఉంచినా వారికి ఉపకారం చేయాలి. అదే దేవునికి ప్రీతి పాత్రమైన విషయం. బంధుత్వ బంధాలను తెంచేవాడు స్వర్గంలో ప్రవేశించడు. ఇస్లాం దృష్టిలో ఇది మహా పాపం. ఈ పాపం చేసినవారికి స్వర్గ ద్వారాలు మూసుకు పోతాయి.

అధర్మమైన సంపాదనతో పోషించబడిన శరీరం స్వర్గంలో ప్రవేశించబడదు. స్వర్గం మనస్సుకు రుచించని విషయాలతో కప్పబడి ఉంది. నరకం మనోకాంక్షలతో కప్పబడి ఉంది. కోరికలు నెరవేరే విషయాల పట్ల మనస్సు సులభంగా లొంగిపోతుంది. అది మనస్సుకు రుచికరంగా ఉంటుంది. కాని ఫలితంగా నరకం ప్రాప్తిస్తుంది. కారణం ఇది దేవుని అవిధేయతా మార్గం. ఉదా: మనిషి తన మనస్సుకు స్వేచ్ఛనిచ్చి మధుపానం, వ్యభిచారం, అక్రమార్జనం వంటి పాపకార్యాలు చేస్తూ పోతాడు. అలా చేసి దేవుని ఆగ్రహాన్ని ఆహ్వానిస్తాడు. చివరికి నరకానికి చేరుతాడు.

అనుమానం

అనుమానానికి దూరంగా మెలగండి. ఎందుకంటే అనుమానం మహానీచమైన అబద్ధం. ప్రజలదోషాలను వెతక్కండి. వెంటబడి పొంచి చూడకండి, పరస్పరం అసూయ పడకండి. ఒకరికొకర్ని ద్వేషించుకోకండి. మీరంతా సోదరులుగా మెలగండి. అనుమానం అనేది మనిషి మనస్సుకు హాని కలిగిస్తుంది, పరస్పర సంబంధాల్ని భంగపరుస్తుంది. అనుమానం అంటే మనిషి ఒకరిపట్ల సరైనా ఆధారం, స్పష్టమైన కారణాలు లేకపోయినప్పటికీ దురభిప్రాయం పెంచుకోవడం. అతనికి వ్యతిరేకంగా అపనిందలు చేయడం, కొన్ని సమయాల్లో అనుమానం ఆధారంగా అనుమానితునికి విరుద్ధంగా తీవ్రమైన చర్యలు కూడా తీసుకుంటారు. తరువాత అసలు విషయం తెలిసాక పశ్చాత్తాపం చెందుతాడు. అందువల్ల మహా ప్రవక్త(స) అనుమానాన్ని మహా నీచమైన అబద్ధమని అభివర్ణించారు. దివ్యఖుర్‌ఆన్‌లో కూడా అనుమానం నుండి బయట పడమని హితువు చేయబడింది.

హృదయ సంపత్తి

సంతుష్టి, సంపదలకంటే అధిక ధనం, సాధనా సంపత్తి కాదు. అసలు సంపద హృదయ సంపత్తియే. ఈ హృదయ సంపత్తి అనేది ప్రతి ఒక్కరిలోను ఉండాలి. హృదయ సంపత్తి కలిగిన వారికి ధనం, వస్తు సంపద, లేకపోయినప్పటికీ తాము అగత్యపరులుగా భావించరు. ఈ మానసిక స్థితి వారికి నిజమైన మనశ్శాంతిని ప్రసాదిస్తుంది. ఇలాంటివారు పేదరికంలోనూ రారాజుల్లా భాసిల్లుతారు.

ధనం - దానం - దయ

ధనంలో దేవుడు ఆకర్షణ పెట్టాడు. ఈ విషయంలో మానవున్ని పరీక్షించడం జరుగుతుంది. ఏ వ్యక్తి ధనపిపాసలో పడిపోతాడో అతని ఆశ పెరుగుతూ ఉంటుంది. ఎన్ని ధనరాసులైన అతనికి సరిపోవు.

ఏ వ్యక్తి దీనికి భిన్నంగా అత్యాశ, పేరాశతో తన హృదయాన్ని కలుషితం కాకుండా శుద్ధంగా ఉంచుకుంటాడో, ఎంత సొమ్ము లభించినా దేవునికి కృతజ్ఞతలు తెలుపుకుంటాడో అతనికి కొంత సొమ్ము కూడా సరిపోతుంది. అందులో అల్లాహ్ శుభశ్రేయాలను అనుగ్రహిస్తాడు.

ఎవరైతే కరుణ చూపరో వారికీ కరుణ చూపడం జరగదు. దైవప్రవక్త (స) ప్రవచనాల్లో సృష్టిరాసుల పట్ల కరుణ చూపడం, మానవుల పట్ల జాతి, మతం, తేడా లేకుండా దయ చూపేవారే దైవకారుణ్యానికి అర్హులౌతారు.

మంచీ చెడు

మంచీచెడులకు ప్రమాణం ఒకరి అందచందాలు, ఆస్తిపాస్తులు కాదు. వారి హృదయ స్థితి, ఆచరణా స్థితిగతులు. ఒకరు తన మేని ఛాయ, సిరిసంపదలను చూసుకొని గర్వించడం నిష్ప్రయోజనం. ఎందుకంటే మానవుని అసలు సౌందర్యం అతని ముఖంలో కాదు, అతని శీలంలో ఉంటుంది. అతని అసలు స్థానం అతని ధన బలం వల్ల కాదు, నైతిక బలం వల్ల నిర్ణయమవుతుంది. దేవుని వద్ద గౌరవనీయుడు చిత్తశుద్ధి, కార్యశుద్ధి గలవాడు మాత్రమే. ఈ లక్షణాలు లేని వ్యక్తి ఎంతటి అందగాడైనా, ఎంతటి సంపన్నుడైనా దేవుని వద్ద ఎలాంటి గౌరవానికి అనర్హుడు.

తల్లి - తండ్రి

మహనీయ ముహమ్మద్ (స) – తల్లిదండ్రులను ప్రేమించడం మహత్తర కార్యంగా పేర్కొన్నారు, దానికి ఎంతో పుణ్యఫలం లభిస్తుందన్నారు. తల్లిదండ్రులకు ఎంతో మక్కువతో సేవ చేయాలని కూడా తాకీదు చేశారు. తల్లిదండ్రుల సేవ ఎంతగానో ఆయుష్షును ఉపాధినీ పెంచుతుందని తెలిపారు.

ఒక సందర్భంలో దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "స్వర్గం తల్లి పాదాల క్రింద ఉంది" అంటే నిండు గుండెతో తల్లికి సేవ చేసి, ఆమెతో అత్యుత్తమ రీతిలో ప్రవర్తించి ఆమెను సంతోషపెట్టినట్లయితే స్వర్గం ప్రాప్తిస్తుంది. అంటే ఆమెకు సేవ చేస్తే మనం స్వర్గంలో ప్రవేశించవచ్చు అని అర్థం.

telgo NOVEMBER.indd 15 10/20/11 4:04 PM

మహిమాన్విత నగరం...
7వ పేజీ తరువాయి భాగం

ఈ ప్రకారం **'కాబా'** ఉనికి సమస్త మానవాళి మనుగడకు కారభూతం అవుతుంది. ఈ గౌరవప్రదమైన గృహం ఉన్నంత కాలం మాత్రమే ప్రపంచం ఉంటుంది. ప్రపంచంలో ప్రగతి పచ్చతోరణాల కళకళలూ ఉంటాయి. అలాగే ఈ గృహం ఎప్పటి వరకు గౌరవించబడుతుందో లేదా ఈ గృహాన్ని గౌరవించారు ఎప్పటి వరకు బ్రతికుంటారో అప్పటి వరకే ప్రజా – తన, ధన, మానాలకు గౌరవం–రక్షణ ఉంటుంది. ఈ విశ్వాన్ని అంతం చేయాలని విశ్వకర్త తలచినప్పుడు కాబా గృహం కూల్చివేయబడుతుందని పలు హదీసుల ద్వారా రూఢీ అవుతుంది. ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: **"(ప్రళయ సమీపంలో) ఎలాంటి గౌరవ మర్యాదలు లేని పొట్టి కాళ్ళ నీగ్రో కాబాను నిర్మానుష్యంగా మార్చేస్తాడు".**

(బుఖారి, ముస్లిం)

అంటే ఆ నీగ్రో వ్యక్తికన్నా ముందు ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా ఈ గృహాన్ని పూర్తిగా నేలమట్టం చేయడం ఎవరి తరం కాదు. 70 వేల ఏనుగుల సైన్యంతో వచ్చి అబ్రహాను నాశనం చేసినట్లే ఈ గృహానికి చెడు తలపెట్టాలనుకొని పన్నాగాలు పన్నే ప్రజల్ని, ప్రాంతాల్ని, దేశాల్ని, రాజ్యాల్ని సయితం అల్లాహ్ నామరూపాల్లేకుండా చేసేస్తాడు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ గృహ రక్షణ లోక రక్షణ. ఈ గృహ వినాశనం, లోక వినాశనం.

2) కాబా గృహాన్ని **'బైతుల్ హరామ్'** (పవిత్ర గృహం, గౌరవమర్యాదల గృహం) అని అనడానికి ప్రధాన కారణం – దాని పరిధిలో వచ్చే ప్రాంతంలో వేటాడటం, చెట్లు నరకటం ఇత్యాధివి నిషేధించబడ్డాయి. ఆఖరికి కన్న తండ్రిని చంపిన దుర్మార్గుడు తారస పడినా ఆ పరిధిలో ప్రతీకారం తీర్చుకునేందుకు అనుమతించబడలేదు. అంతేకాక, ఈ ప్రాంత జనుల నివాసానికి, మనుగడకు యోగ్యమైన ప్రాంతంగా ఖరారు చేయబడింది అంటే, ఈ పవిత్ర గృహ మూలంగా మక్కా వాసుల జీవనం సుఖప్రద మవ్వటమేకాకూండా, ఆర్థికంగా అది వారికి బలం చేకూరుస్తుంది. అనగా, మక్కా ప్రజలకు లేదా సవూదీ ప్రజలకు లభించే ఈ స్వాగతసన్మానాలు, గౌరవాదరణలు కాబా గృహ కారణంగానే. ఈ కాబా గృహం వల్లనే మక్కాలోని జనులు సుఖశాంతులతో వర్ధిల్లుతున్నారు. ప్రపంచం మొత్తం అశాంతి అల జడులమయమై ఉన్నా అక్కడ మాత్రం శాంతి సుస్థిరతలున్నాయి.

ఇంతటి గౌరవం ఒక్క మక్కాకే ఎలా దక్కింది అంటే, దైవ ప్రవక్త (స) వారి ఈ హదీసు చదవాల్సిందే. **"నిశ్చయంగా అల్లాహ్, ఈ పట్టణాన్ని భూమ్యాకాశాలను పుట్టించిన నాటి నుండే పవిత్రంగా చేశాడు. అది ప్రళయం వరకూ అల్లాహ్ అనుగ్రహించిన ఔన్నత్యంతో పవిత్రంగానే చూడబడుతోంది".**

(బుఖారీ, ముస్లిం)

నేడు మానవులు అనేక స్థలాలను, ప్రదేశాలను పవిత్రంగా చేసుకున్నారు. ఆ స్థలం, ఆ ప్రాంతం ఏ సమాజానికి, మరే మతానికి సంబంధించినదైనా కావచ్చు. మక్కా అంతటి పవిత్రత, గౌరవం వాటిలో ఏ ఒక్కటికీ లేదు అన్నది మాత్రం విర్వివాదాంశం. ఎందుకంటే, మక్కాకు లభించిన పవిత్రత సనాతనం, నిత్య నూతనం, దైవ ప్రసాదితం. ఇతర ప్రాంతాలకు లభించినది మానవ కల్పితం, కృత్రిమం, క్షణికం. ఏ నిమిషం మనిషి చేసిన సిద్ధాంతాలు దేనిక కొరగాకుండా పోతాయో మరుక్షణం ఆయా స్థలాలు, ఆలయాలు తమ పవిత్రతను కోల్పోతాయి. స్వయం మనిషే తన స్వహస్తాలతో వాటిని కుప్పకూలుస్తాడు. అయితే మక్కా మక్కాలోని కాబా అటువంటిది కాదు. దీనికి సుదీర్ఘమైన మానవ చరిత్రే ప్రత్యక్ష సాక్షి!

అల్లాహ్ ఈ పట్టణంలోని కాబా గృహం వైపు ముఖం త్రిప్పి నమాజు చేయవలసిందిగా ఆదేశించాడు: **"(ఓ ప్రవక్తా!) ఏ స్థలం నుంచి నీవు వెడలినా నీ ముఖాన్ని మస్జిదె హరామ్ వైపు నకే త్రిప్పు. మీరు ఎక్కడ ఉన్నాసరే, మీ ముఖాలను దాని వైపునకే త్రిప్పండి–జనులు మీతో వాదులాటకు దిగకుండా ఉండటానికి (ఇలాగే చేయండి). వారిలో దుర్మార్గులకు (వారు ఎలాగూ రాద్ధాంతం చేసేవారే. అంత మాత్రాన మీరు వారికి) భయపడకండి. నాకు మాత్రమే భయపడండి నేను నా అనుగ్రహాన్ని మీపై సంపూర్తి గావించటానికి, మీరు సన్మార్గాములు అవటానికి".** (అల్‌బఖర: 150)

'కాబా' వైపు ముఖం త్రిప్పి నమాజు చేయండి అన్న ఆజ్ఞ ఒకటి, రెండు కాదు– మూడుసార్లు చెప్పబడింది. దీన్నిబట్టి ఈ విషయానికి ఎంత ప్రాముఖ్యత ఉందో అర్థమవుతుంది. ఈ దిశ మార్పును దేవుడు తన అనుగ్రహాల పరిపూర్తిగా, సన్మార్గ భాగ్యానికి ప్రతీకగా అభివర్ణించాడు. అలాగే దైవాదేశాలను శిరసావహించే మనిషి సదా గౌరవపురస్కారాలకు అర్హుడవు తాడనీ, సన్మార్గ భాగ్యం కూడా అతన్ని వరిస్తుందని స్పష్టం చేశాడు.

ఇన్ని విశిష్టతల కారణంగానే అల్లాహ్ ఈ పట్టణాన్ని ప్రమాణంగా తీసుకున్నాడు: **"శాంతియుతమైన ఈ నగరం సాక్షిగా!".**

(తీన్: 4)

"ఈ నగరం తోడుగా!" (బలద్; 1)

అల్లాహ్ ఈ ఆయతులలో మక్కా నగరంపై ఒట్టేసి విషయం చెబుతున్నాడంటే, దీన్ని బట్టి ఈ నగరం ప్రాశస్త్యాన్ని ఊహించ వచ్చు. దైవ ప్రవక్త (స) మక్కాను వీడి వెళు తూ 'హజ్వరా' ప్రదేశంలో నిలబడి మక్కా నుద్దేశించి ఇలా అన్నారు: **"ఓ మక్కా! అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను. నీవు అల్లాహ్ భూభాగాలన్నింటిలోకెల్లా అత్యంత మహిమాన్వితమైన నేలవు. భూభాగాలన్నింటిలోకెల్లా అల్లాహ్‌కు అత్యంత ప్రియ మైన భూభాగానివి. నాకూ నీవు మిక్కి ఇష్టమైన భూభాగానివే. మక్కా వాసులే (అవిశ్వాసులే) గనక నన్ను నీ నుండి వెలివేసి ఉండక పోతే నేను ఎన్నటికీ నిన్ను వీడి వెళ్ళేవాడను కాను. (నిన్ను వీడి మరో భూభాగంలో నివాసం ఏర్పచుకునేవాడను కాను)".** (తిర్మిజీ)

మహిమాన్వత నగరం మక్కా పురం అంటే అనంత కరుణామయుడైన అల్లాహ్‌కు, సర్వలోక కారుణ్యమూర్తి అయిన అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారికి ఎంతో ఇష్టం. కాబట్టి మనం కూడా మక్కా నగరాన్ని, అందులోని ప్రతి ప్రదేశాన్ని ప్రేమించాలి, అభిమానించాలి, గౌరవించాలి. స్థాయి, స్థోమత ఉంటే ఆ గృహాన్ని ఉద్దేశించి హజ్జ్ చేయాలి. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: **"అక్కడికి వెళ్ళే స్థోమత గల వారికి, అ గృహ (యాత్ర) హజ్జ్ చేయడాన్ని అల్లాహ్ విధిగా చేశాడు. మరెవరయినా (ఈ ఆజ్ఞను శిరసావహించటానికి) నిరాకరిస్తే అల్లాహ్‌కు సమస్త లోకవాసుల అవసరం ఎంత మాత్రం లేదు".**

(ఆలి ఇమ్రాన్: 97)

ఈ కారణంగానే దాదాపు ప్రవక్తలు తమ శేష జీవితాన్ని ఈ పట్టణంలో జీవించి కన్ను మూయాలని ఆశ పడ్డారు. ఒక్క మాటలో చెప్పాలంటే, మనిషి మరింత మంచి సౌకర్యాలతో బ్రతకటానికి జీవనోపాధిని వెతుక్కుంటూ ప్రపంచ నలుమూలలా వేళతాడు. కానీ మక్కా వెళ్ళే వారు మాత్రం అక్కడే మరణించాలని, అక్కడ మరణం రావడం తమ భాగ్యమని బయలుదేరతారు. అంటే, భూ ఇతర భాగాలు మనిషిని పదార్థ పూజారిగా, దానవుడిగా మార్చితే, మక్కా పురం మనిషిని పరమాత్మ దాసుడిగా, మనసున్న మనీషిగా తీర్చిదిద్దుతుంది.

అల్లాహ్ మనందరి మక్కాకెళ్ళి హజ్జ్ ఉమ్రాలు చేసే భాగ్యాన్ని మళ్ళి మళ్ళీ అనుగ్రహించుగాక! అమీన్.

telgo NOVEMBER.indd 16 10/20/11 4:04 PM

'నెలవంక'కు సంబంధించిన సర్వే

నెలవంక ప్రారంభమై 6 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఐపిసి యాజమాన్యం భవిష్యత్ అధ్యయనం దృష్ట్యా ఓ సర్వే నిర్వహించగోరుచున్నది. ఈ సర్వే ప్రశ్నావళి ద్వారా వచ్చే పాఠక మహాశయుల అమూల్యమైన సూచనలు, విలువైన సలహాల ఆధారంగా నెలవంక పత్రికను మరింత శోభతో, మరిన్ని మెరుగులతో అందంగా పాఠక మహోదయుల వద్దకు తీసుకెళ్ళాలన్నది ఐపిసి ముఖ్యోద్దేశ్యం. క్రింద ఇవ్వబడిన ప్రశ్నావళిని నిశిత దృష్టితో చదివి సమాధానాలు వ్రాసి ఐపిసి సంపాదక వర్గానికి పంపగలరని ఆశిస్తున్నాము. మీ విలువైన సలహాలు, అమూల్యమైన సూచనలే నెలవంక పత్రిక భవిష్యత్తుకు దిశా నిర్దేశాలు కాగలవని తెలిజేస్తున్నందుకు సంతోషిస్తున్నాము.

మొదటి అక్షం: పత్రిక బహిర్గతం మేరకు

మీకు పత్రిక పరిచయం ఎలా అయ్యింది?

⊙ ఐపిసి బ్రాంచీల నుంచి ⊙ మీ నివాస స్థలం నుంచి ⊙ మీ కార్యాలయం నుంచి ⊙ ఇతర ప్రాంతాల నుంచి

పత్రిక మీకు సులభంగా అందుతుందా?

⊙ అవును ⊙ లేదు

రెండవ అక్షం: సంపాదకీయం మరియు శీర్షికలు

పత్రికలో వస్తున్న శీర్షికల గురించి మీ అభిప్రాయం?

⊙ చాలా బాగున్నాయి ⊙ బాగున్నాయి ⊙ ఫర్వాలేదు

ప్రవాసాంధ్రులకు సంబంధించి అంశాల్ని పత్రిక చర్చిస్తున్నదా?

⊙ అవును ⊙ కాదు ⊙ అప్పుడప్పుడు

పత్రికలో మీకు ఎక్కువగా నచ్చిన శీర్షికలు ఏవి?

⊙ ధార్మికపరమైనవి ⊙ వార్తాపరమైనవి ⊙ వినోదపర మైనవి ⊙ విజ్ఞాన పరమైనవి ⊙ సామాజిక పరమైనవి ⊙ ఇతరములు.....

మూడవ అక్షం: భాషా అనువాదం

పత్రికలో ఉపయోగించబడుతున్న భాషాశైలి ఎలా ఉంది?

⊙ సులభంగా ఉంది ⊙ వ్యవహారికమైనది ⊙ బాగా లేదు ⊙ కష్టతరమైనది

పత్రికలోని వ్యాసాల గురించి మీ అభిప్రాయం?

⊙ చాలా బాగున్నాయి ⊙ బాగున్నాయి ⊙ ఫర్వాలేదు

నాల్గవ అక్షం: ఆకృతి మరియు అవుట్ పుట్

పత్రిక సైజు మరియు పేజీల సంఖ్య ఎలా ఉంది?

⊙ చాలా బాగుంది ⊙ బాగుంది కానీ మార్పు అవసరం ⊙ బాగా లేదు

వ్యాసాల్లో తీసుకోబడుతున్న పోటోలు ఎలా ఉంటున్నాయి?

⊙ సబ్జెక్ట్‌ను బట్టి ఉంటున్నాయి ⊙ బాగున్నాయి కాని మార్పు అవసరం ⊙ బాగాలేవు

పత్రిక కవరు పేజీ డిజైన్ గురించి మీ అభిప్రాయం?

⊙ చాలా బాగుంటుంది ⊙ బాగుంటుంది కాని మార్పు అవసరం ⊙ బాగుండటం లేదు.

పెర్సనల్ డేటా


లింగం: ⊙ పురుడు ⊙ స్త్రీ

వయసు: ⊙ 16 నుండి 25 ⊙ 26 నుండి 35 ⊙ 36 నుండి 45 ⊙ 46కు పైన

విద్యా స్థాయి: ⊙ ప్రాథమిక స్థాయి ⊙ మధ్యంతర స్థాయి ⊙ హై సెకండరీ ⊙ డిగ్రీ

మతం: దాన్ని పేర్కొనండి

మీ ఈ సహకారానికి కృతజ్ఞతలు!



telgo NOVEMBER.indd 17 10/20/11 4:05 PM

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

ఖైతాన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో



ఐపిసి ఖైతాన్ బ్రాంచ్ తెలుగు సెక్షన్ ఆధ్వర్యంలో ఈదుల్ ఫిత్ర్ సందర్భంగా 'మత వాస్తవికత' అన్న అంశంపై ఓ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 30 మంది ముస్లిమేతర సోదరులు 8 మంది న్యూ ముస్లింలు సోదరులు పాల్గొన్నారు. భారత దేశం నుంచి విచ్చేసిన ధర్మ ప్రబోధకులు సయ్యిద్ అహ్మద్ గారి ప్రసంగం మరియు ధర్మ సందేశంతోపాటు క్విజ్ ప్రోగ్రామ్ కూడా నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయబడ్డాయి. మౌలానా షేక్ అబ్దుస్సలాం ఉమ్రీ గారు సారథ్యం వహించి ఈ కార్యక్రమానికి అన్ని విధాల సహాయపడిన సోదరులందరికి ఆయన కృతజ్ఞలు తెలుపడంతో ఈ కార్యక్రమం ముగిసింది.





ఐపిసి ఆధ్వర్యంలో 'విహార యాత్ర'

ఐపిసి తెలుగు విభాగం ఆధ్వర్యంలో 30- 09- 2011వ తేదీ శుక్రవారం నాడు తెలుగు న్యూ ముస్లిం సోదరులు కువైట్‌లోని గ్రీన్‌లాండ్‌ను సందర్శించుకున్నారు. ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో సాగిన ఈ విహారం ప్రశాంతంగా ముగిసింది.







telgo NOVEMBER.indd 18 10/20/11 4:05 PM

వివాహ మహోత్సవం



అది 18-9-2011 ఆదివారం. రాత్రి 10 గంటలు...కువైట్ సిటీలో స్విజ్ ప్లాజాలోని ఓ హాలు కళా కాంతులీనుతోంది. నిర్వాహకులతో, సిబ్బందితో, అతిథులతో కోలాహలంగా ఉంది... ఎందుకంటే అది వలీమా విందు! సన్మార్గ భాగ్యాన్ని ఆస్వాదించిన ఇద్దరు వ్యక్తులు వివాహ బంధంలో ఇమిడిన శుభ ఘడియా!! ఈ నూతన జంటను ఐపిసి జనరల్ మేనేజర్ శ్రీ జమాల్ నాసిర్ అల్ షత్తీ గారు మరియు ఐపిసి సందేశ విభాగం అధికారి శ్రీ ముసాయిద్ అల్ అనజీ దీవించారు. నూతన వధూవరుల మధ్య అల్లాహ్ నిజమైన ప్రేమానురాగాలను సృజించాలని, వారి సంసార రథం ధర్మపథంలో సాఫీగా సాగిపోవాలని ప్రార్థించారు. ధర్మసమ్మతమైన సుఖ సంతోషాలన్నింటినీ అల్లాహ్ వారికి అనుగ్రహించాలని ఐపిసి ధర్మ ప్రబోధకులందరూ దుఆ చేశారు. ఇంతకీ వధూవరులెవరో చెప్పలేదు కదూ! వరుడు ఇస్లామీయ సోదరుడు సఅద్. వధువు ఇస్లామీయ సోదరి ఆయిషా.













ఖుర్ఆన్ విజేతలకు సన్మానం

ఐపిసి ఆధ్వర్యంలో 11- 10- 2011వ తేదీ మంగళవారం నాడు గత రమజాన్‌లో జరిగిన 10వ ఖుర్ఆన్ కంఠస్థ పోటీలలో విజేతలైన వారిని ఐపిసి ఘనంగా నస్మానించింది. జుమూ బుస్సుర్రాలోని **హయ్యతుల్ ఖైరియా అల్ ఆలమియా** ఆడిటోరియంలో జరిగిన ఈ సన్మాన సభకు వివిధ దేశాలకు చెందిన విజేతలు, వారి ఆత్మీయులు హాజరై ఆనందభాష్పాలు రాల్చారు. అందమైన వీడియో క్లిప్స్ ప్రదర్శింబడ్డాయి. **'కంఠస్తం చేయాలనుకున్న వారికి ప్రపంచంలోనే అత్యంత సులభతరమైన గ్రంథం ఖుర్ఆన్'** అన్న ఆయా విజేతల మాటలు అందరికీ స్ఫూర్తిగా నిలిచాయి. ఏటేటా జరిగే ఈ పోటీలకు **'సులైమాన్ సాలెహ్ రుహైమానీ'** కుటుంబీకులు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నారు.









telgo NOVEMBER.indd 19 10/20/11 4:06 PM

ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)

మానవ జాతికి మేలి మలుపును ఇచ్చిన మహా మనీషి

4) సంస్కరణోద్యమంలో యువకుల పాత్ర

యువకులైన ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) గారి మిథ్యా దైవాలపై తిరుగుబాటును ఆయన జాతి ప్రజలు పరస్పరం చర్చించుకోవడం గురించి ఖుర్‌ఆన్ ఇలా పేర్కొంటుంది: **"ఒక యువకుడు వాటి (విగ్రహాల) బలహీనతను ఎండ గడుతూ ఉండటం మేము విన్నాము. అతను ఇబ్రాహీమ్‌గా పిలువబడుతున్నాడు"** అని కొందరు చెప్పారు; (అంబియా: 60)



పూర్వం దిఖియానోస్ అనే ఒక రాజు ఉండేవాడు. అతడు బహుదైవారాధన వైపునకు, జాతరల వైపునకు ప్రజల్ని పురిగొల్పే వాడు. అయితే అదే రాజ్యంలో నివసించే సంపన్న వర్గాలకి చెందిన యువకులు కొందరు సత్యాన్వేషణ జరిపి సృష్టికికర్త ఒక్కడేనన్న విషయాన్ని గ్రహించారు. దాన్నే అమలు పర్చారు. చివరికి అప్పటి రాజు పిలిచి అడిగినా ధైర్యంగా సత్యాన్ని నిర్దిష్టంగా వెల్లడించారు. వీరి గురించి అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ప్రస్తావిస్తూ ఇలా అన్నాడు: **"తమ ప్రభువును విశ్వసించిన కొంత మంది యువకులు వారు. మేము వారి సన్మార్గంలో వృద్ధి నొసగాము".** (అల్ కహఫ్: 13)

ఇలా చెప్పుకుపోతే– ప్రవక్త నూహ్ (అ), ప్రవక్త యూనుస్ (అ), ప్రవక్త షుఐబ్ (అ), ప్రవక్త మూసా (అ), ప్రవక్త ఈసా (అ), అంతిమై దైవ ప్రవక్త ముహమ్మద్ (స) – అందరూ యువకులే. వారి తర్వాత హజ్రత్ అబూ బకర్, ఉమర్, ఉస్మాన్, అలీ, హసన్, హుసైన్, ఖాలిద్ బిన్ వలీద్, ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ మొదలగువారందరూ యువకులే.

అదే విధంగా తారిఖ్ బిన్ జియాద్, ముహమ్మద్ బిన్ ఖాసిమ్, సలాహుద్దీన్ అయ్యూబీ, ఇమామ్ ఇబ్ను తైమియా, ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్, షా వలీ యుల్లాహ్ ముహద్దిస్ (ర), షా ఇస్మాయీల్ షహీద్ (ర), మౌలానా సనావుల్లాహ్ అమ్రు త్సరీ, మౌలానా అబుల్ ఆలా మౌదూదీ, సయ్యిద్ ఖుతుబ్ షహీద్ (ర)– వీరందరూ యువకులే. మానవ రాసికి చెందిన ఆణిముత్యాలు. ఒక్క మాటలో చెప్పాలంటే–ఏ జాతి యువకులు ప్రయోజకులై ఉంటారో ఆ జాతి గతి సుగతి అవుతుంది. మరే జాతి యువకులు వ్యసనపరులై ఉంటారో ఆ జాతి గతి దుర్గతే. కాబట్టి ధర్మ ప్రచార బాధ్యత వృద్ధులకన్నా యువకుల మీదే ఎక్కువగా ఉంటుంది.

5) సత్యప్రియులు నిరాశ చెందరు

ధైర్యసాహసాల్ని నీరుగార్చే అంశాల నుండి కాల్పనిక ఊహల నుండి మనం దూరంగా ఉండాలి. ఇలాంటి ఆలోచనల్నిగానీ, ఆలోచనా పరుల సాంగత్యాన్ని గానీ మనం స్వీకరించకూడదు. ఆత్మ విశ్వాసం మనపై మనకు విశ్వాసం పెంచుతుంది. మనకేం కావాలో మనో ఫలకంపై చిత్రీకరించుకుని, మన గమ్యానికి చేరుకోవడానికి స్పష్టమైన మార్గాన్ని ఎన్నికోవాలి. ఎదురవ్వ బోయే అడ్డకుంలను, అవరోధాలను, ప్రతి బంధకాలను ఎలా అధిగమించాలో ముందు గానే పథకాలు తయారు చేసుకోవాలి. అవ సరమైన వనరులను, ప్రత్యామ్నాయ వ్యూహాలను కూడా సిద్ధం చేసుకోవాలి. ఆ తర్వాత అంకిత భావంతో పురోగమిస్తే లక్ష్యాలను సులువుగా సాధించవచ్చు. మన ప్రేరణ మనమెంత దూరం ప్రయాణించామన్నది కాకుండా మనమింకా ఎంత దూరం ప్రయాణించాలన్నదై ఉండాలి.

చూడండి! ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) తన జాతి ప్రజల కళ్ళు తెరిపించాలని ఓ పథకం ఏర్పాటు చేసుకున్నారు. తర్వాత ఎదురవ్వ బోయే పరిణామాలను ముందుగానే అంచనా వేసుకున్నారు. "ఓ ఇబ్రాహీమ్! మా దేవుళ్ళని అపహాస్యానికి పాల్జేసింది నువ్వేనా?" అని జాతి జనులు నిలదీస్తే, 'నన్ను నిలదీసి ఏమిటి ప్రయోజనం? మీరు నా మాట ఎలాగూ నమ్మరు, తరతరాలుగా మీరు దైవాలుగా భావిస్తూ వస్తున్న ఆ విగ్రహాలనే అడగండి. ఒకవేళ వాటికి చెప్పే శక్తి ఉంటే వాటిపై జరిగిన అఘాయిత్యాన్ని అవే ఫిర్యాదు చేస్తాయి' అన్న ఆయన సమాధానం జాతి ప్రజల్ని ఆలోచనలో పడవేసింది.

తర్వాత షాక్ నుంచి తేరుకుని **'ఈ విగ్రహాలు పలుకలేవన్న సంగతి నీకూ తెలుసు కదా?'** అని ఎదురు ప్రశ్న వేశారు. అందుకు ఇబ్రాహీమ్ (అ) 'ఇదే నిజమైతే మరి మీరు అల్లాహ్‌ను వదలి మీకు ఏ మాత్రం లాభంగానీ, నష్టంగానీ కలిగించ లేని, స్వయానికే రక్షణ కల్పించుకోలేని వాటిని ఎందుకు పూజిస్తున్నారు? అల్లాహ్ ను కాదని మీరు కొలిచే విగ్రహ ప్రతిమల పైన ఈగ వాలినా తోలుకలేని అశక్తులే అవి. మీకు ఈ పాటి ఇంగిత జ్ఞానం కూడా లేదా?' అని వారిని సూటిగా అడిగారు. హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) హేతుబద్ధంగా ఇచ్చిన సమాధానం వాళ్ళను ఆలోచనలో పడవేసింది. వందల సంవత్స రాలుగా జడప్రాయంగా ఉన్న వారి బుద్ధి వివేకాల్లో ఒక్కసారి చలనం చోటు చేసుకుంది. అయినా అది మూడు నిమిషాల మార్పు గానే మిగిలింది. వారు సత్యాన్ని బాహాటంగా ఒప్పుకోవడానికి సాహసించలేక పోయారు.

6) ఇంట గెలిచి రచ్చ గెలువు

ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) తనకు జ్ఞానోదయం అయిన మీదట ముందు తన ఇంటివారిని సత్యమార్గం వైపు ఆహ్వానించారు. **'నాన్నా! వినలేని, చూడలేని, మీకు ఏ మాత్రం ఉపయోగపడలేని వాటిని ఎందుకు పూజిస్తున్నారు? ఓ పితామహా! చూడండి మీ వద్దకు రాని జ్ఞానం నా వద్దకు వచ్చింది. (నేను సకల లోకాల ప్రభువును కనుగొన్నాను. సృష్టికర్త కాదని ఇతరత్రా సృష్టిరాసులను పూజించే, హారతులు పట్టే వారికి పట్టే దుర్గతి ఎంత ఘోరంగా ఉంటుందో నాకర్థమయింది.) కనుక మీరు నన్ను అనుసరించండి. నేను మీకు సరైన మార్గం వైపు దర్శకత్వం వహిస్తాను. ఓ తండ్రీ! మీరు షైతాన్ దాస్యాన్ని (మిథ్యను)**

telgo NOVEMBER.indd 20 10/20/11 4:06 PM

విడనాడండి. ఓ తండ్రీ! మీరు ఎక్కడ కరుణామయుని ఆగ్రహానికి గురవుతారోనని షైతాన్ సహవాసి అయిపోతారోనని నాకు భయంగా ఉంది' అన్నారు ఇబ్రాహీమ్.
(మర్యమ్: 42-45)

ఖుర్ఆన్‌లో ఇలా ఉంది: "నీ సమీప బంధువులను హెచ్చరించు". (షుఅరా: 214)

ఈ ఆయతు అవతరించిన తర్వాత దైవ ప్రవక్త ముహమ్మద్ (స) తన బంధువుల్ని ఆహ్వానించి ఇలా అన్నారు: "మీరు దైవ సన్నిధీలో మిమ్మల్ని రక్షించుకునే బందోబస్తు చేసుకోండి. అక్కడ నేను మీకు ఏ విధంగానూ ఉపయోగపడలేను". (ముస్లిం)

అంటే, ఇతరులను సన్మార్గం వైపు పిలిచే ముందు దగ్గరి బంధువులను ఆ మార్గంలోకి తేవాలన్న భావం ఈ ఆయతుల్లో అంతర్లీనమై ఉంది.

విశ్వాసాన్ని బట్టి పరీక్ష

దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: "ప్రజలందరిలోకెల్లా అత్యంత తీవ్రతరమైన పరీక్షకు గురిచేయబడేవారు ప్రవక్తలు. ఆ తర్వాత విశ్వాసంలో వారిని పోలినవారు, ఆ తర్వాత వారిని పోలినవారు".



అల్లాహ్ ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)ను తండ్రి ద్వారా, సమాజం ద్వారా, రాజు ద్వారా, అగ్ని ద్వారా పరీక్షించాడు. చివరికి పాలు త్రాగే పసికందుని నిర్జన ప్రదేశంలో వదిలేసి రమ్మని చెప్పినా, ఎన్నో ఏళ్ళకు తనకు కలిగిన ఒకే ఒక్క సంతాన్ని సయితం జిబహ్ చేయమని ఆదేశించినా ఆయన తడబడలేదు. వెనకడుగు వేయలేదు. ఇదే విషయాన్ని ఖుర్ఆన్ ఇలా పేర్కొంటుంది: **"ఇబ్రాహీమ్‌ను అతని ప్రభువు అనేక విషయాలలో పరీక్షించగా, అతను అన్నింటిలోనూ (నికార్సుగా) నెగ్గుకు వచ్చాడు".** (బఖర: 124)

హిజ్రత్ ప్రవక్తల సంప్రదాయం

పరిస్థితులు అనుకూలించనప్పుడు దాదాపు ప్రవక్తలందరూ దైవాదేశం మేరకు హిజ్రత్ చేశారు. ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) ఇరాక్‌లోని 'ఉర్' ప్రాంతం నుండి, షామ్ దేశానికి, ఆ తర్వాత హిరాన్ ప్రాంతానికి, ఆనక ఫలస్తీనా భూభాగానికి హిజ్రత్ చేసి వెళ్ళారు. దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: "నిశ్చయంగా కర్మలు సంకల్పాలపై ఆధారపడి ఉంటాయి. ఎవరైతే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వైపునకు హిజ్రత్ చేస్తారో వారి ఉద్దేశ్యాన్ని బట్టే వారి కర్మ సిద్ధిస్తుంది. స్త్రీని మనువాడేందుకు, వ్యాపారం నిమిత్తం ప్రాపంచిక ఇతర ప్రయోజనాల దృష్ట్యా ఎవరు హిజ్రత్ చేస్తారో వారు కోరిందే వారికి దక్కుతుంది". (బుఖారీ)

ఇస్లాం వ్యవస్థాపకులు ముహమ్మద్ (స) కాదు

చాలా మంది ముస్లిమేతర పండితులు, చరిత్రకారులు ముస్లింలను ముహ్మదీయులుగా, ఇస్లాంను ముహమ్మదీయ మతంగా అభివర్ణిస్తుంటారు. ఇది నిరాధారమైన నిందారోపణ, మరియు ఇస్లాం ప్రవాహ శక్తి అడ్డుకునే కుయుక్తి తప్ప మరేమీ కాదు. నిశితంగా ఖుర్ఆన్ అధ్యయనం చేసే ప్రతి ఒక్కరికి ఈ విషయం అవలీలగా అర్థమై పోతుంది. హజ్ క్రియల్నే తీసుకుందాం. తవాఫ్, ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) వారి జీవితం తో ముడిపడి ఉన్న అంశం. ఖుర్బానీ కూడా ఇబ్రాహీమ్ (అ) గారి జీవితంలోని మమేకాంశమే. సఫామర్వాల మధ్య సఫా హాజ్రత్ హాజిరా (అ) గారి నిరుపమాన విశ్వాస జ్ఞాపకార్థం చేసే ఆచరణే. దీని బట్టి అర్థమయ్యేదేమిటంటే, ఇస్లాం ఒక్క ముహమ్మద్ (స) వారి మతం కాదు, అది ప్రవక్తలందరి జీవన ధర్మం. ఖుర్ఆన్‌లో ఇలా ఉంది: "మేము అల్లాహ్‌ను విశ్వసించాము. మాపై అవతరింపజేయబడిన దాని (ఖుర్ఆన్)నీ, ఇబ్రాహీమ్, ఇస్మాయీల్, ఇస్హాఖ్, యాఖూబ్ మరియు వారి సంతతిపై అవతరింప జేయబడిన దానినీ, మూసా, ఈసా ప్రవక్తలకు వారి ప్రభువు తరఫున ఒసగబడిన దానిని కూడా మేము విశ్వసించాము. మేము వారిలో ఎవరి మధ్య కూడా ఎలాంటి విచక్షణ (వివక్ష)ను పాటించము. మేము ఆయనకే విధేయులము - ముస్లింలము".
(బఖర: 136)

"ఒకవేళ వారు (విశ్వ జనులందరూ) మీరు విశ్వసించినట్టే విశ్వసిస్తే, సన్మార్గం పొందగలరు. విముఖత గనక చూపితే వారు అహంభావానికి, వైర భావానికి లోనై ఉన్నారన్నది గమనార్హం". (బఖరా: 137)

ఇదే ప్రపంచ ప్రజలకు ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) వారి జీవిత చరిత్ర ఇచ్చే సందేశం.

దీన్ అంటే ఏంది తండ్రీ!

తండ్రీ..! నా బుజ్జి తండ్రీ..!
చాలా రోజుల నుంచి నిన్నొకటి అడగాలనుకుంటున్నాను
అడిగితే చిరాకు పడవు కదా తండ్రీ...!
తండ్రీ...నాకు తెలియకడుగుతా
అసలు దీన్ అంటే ఏంది తండ్రీ...?!

ఊర్లల్లో-చావిడీలల్లో-పీర్లపండగల్లో
తప్పత్రాగి చిందులేస్తుంటే
ఇది ప్రవక్త (స) సంప్రదాయం కాదు
ఈలలు, చప్పట్లు విశ్వాసులకు తగదు
ఇది ధర్మంలో లేని నూతన పోకడ అంటే...
పటపటమని...పళ్లు కొరికి కయ్యానికి కాలు
దువ్వడమేనా దీన్ అంటే...?

మస్తాన్ వలీ దీవానె వలీ దర్గా కాదా
అమ్మీజాన్ బావాజాన్ల దర్గా కాదా
నన్గే బాబా జుమ్లేషా వలీ దర్గా కాదా
నాగూర్, కస్మూర్, అజ్మీర్ దర్గాల కాదా
సదింపుల కోసం సామగ్రి
సమాధి ప్రదక్షిణ కోసం స్త్రీలు
మొక్కుబడుల కోసం చాదర్లు
పూనకాల కోసం దెయ్యాలు వెళుతుంటే...
ఇది షిర్క్-బహుదైవారాధన, ఇది నేరం అంటే...
కత్తులు, కటార్లు తీసుకుని రక్తపుటేర్ల కోసం
మీసాలు మేలేసి, తొడ కొట్టడమా దీన్ అంటే..?

తండ్రీ..! కరువులొచ్చినప్పుడు...వాన చినుకు కోసం
ఊరుఊరంతా కలిసి ఉరుసులు, జెండాలు తీస్తుంటే
జంతువులు సమేతంగా స్త్రీపురుషులు కలిసి ఊరి
బైటికెళ్లి సామూహికంగా 'సలాతుల్ ఇస్తిస్ఖా' చదివి
దుఆ చెయ్యడమే శ్రేయస్కరం, ఆదే ప్రవక్త (స)
వారి సంప్రదాయం-సున్నత్ అంటే...
మునాఫిఖ్‌లు, కాఫిర్లు అని పసలేని
ఫత్వాలివ్వడమేనా దీన్ అంటే...?

ఉరుసుల్లో, ఉత్సవాల్లో పీర్లని, పీరు సాహెబులని
నెత్తి మీద పెట్టుకొని ఊరేగుతుంటే
ఇలా ఊరేగడం ఇస్లాం ఎరుగదని ఇలా గతంలో
ఏ ప్రవక్తా, మరే సహాబీ చెయ్యలేదని
ఇది ఖుర్ఆన్ మరియు హదీసులకు విరుద్ధమని అంటే..
సత్సమాజం కోసం పాటు పడే సంఘాల్లో గుప్పెడు
విష గుళికల్ని కలిపి కలుషితం చేసే కల్మష
హస్తాలేనా దీన్ అంటే..?

వెర్రి పోకడలనేవి, వెకిల చేష్టలనేవి సమాజాన్ని
భ్రష్టుపట్టించే, ధర్మాన్ని కళంకపరిచే అతి
ప్రమాదకర విషవాయువులని మనంరికి తెలుసు
కాబట్టి-

మార్గవిహీనుల గుం డెలు అదిరిపడేలా
దైవభీతితో కంపించిపోయేలా
సత్యజ్యోతితో వెలుగొందేలా
సత్య మార్గాన్ని గ్రహించేలా
చాటరా ఏకేశ్వరోపాసం-తౌహీద్‌ని
చూపరా ఖుర్ఆన్-హదీసు ఆధారాల్ని
ఊదరా సంస్కరణ శంఖాన్ని
చేయరా సమాధి బిద్‌ఆత్‌ఖురాఫాత్‌లని

telgo NOVEMBER.indd 21 10/20/11 4:06 PM

ఎముకలు ఉడిగిన ఒక వృద్ధుడికి ఇహ్రాం ధరించి కాబతుల్లాహ్ చేరాక ఉమ్రా చేయడం సాధ్య పడలేదు. అతనేమి చేయాలి?



ప్రశ్న: నకిలీ పాస్‌పోర్టు తయారు చేసుకుని హజ్ చేసే వ్యక్తి హజ్జ్ గురించి మీ అభిప్రాయమేమిటి?

జ: అతని హజ్జ్ సరైనదే. నకిలీ పాస్‌పోర్టు ప్రభావం హజ్జ్ మీద ఎంత మాత్రం ఉండదు. కాకపోతే, ఖచ్చితంగా అతను ఒక అపరాధి. చేసిన అపరాధానికిగానూ అతను దైవ సమక్షంలో పశ్చాత్తాప పడాలి. ఒకవేళ పాస్‌పోర్టు తయారు చేసుకోవాలను కున్నప్పుడు తన వాస్తవ పేరు మరియు వివరాలు మాత్రమే నమోదు చేయించుకోవాలి. లేని ఎడల అతను వాస్తవాలను తారుమారు చేసి అబద్దమాడి దుర్మార్గంతో ధనాతర్జన చేసిన వాడవుతాడు.

ఈ సందర్భంగా నేను నా సహోదరులకు చేసే విజ్ఞప్తి ఏమి టంటే, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో లబ్ధి పొందడం కోసం లేదా ఇతరత్రా కారణాల వల్ల ఇలా చేయడం మామూలు నేరం కాదు. ఎందుకంటే, ఇలా చేయడం వల్ల అనే విషయాల లో పొరపాట్లు జరగడమేకాక, అధికారులకు భ్రమలో ఉ ంచడం జరుగుతుంది గనక. ఇటువంటి అత్యాశపరులు గుర్తుంచుకోవా ల్సిన విషయం ఏమిటంటే, ఎవరైతే అల్లాహ్‌కు భయపడతారో వారికి కష్టాల నుండి విముక్తి పొందే మార్గాన్ని అల్లాహ్ చూపు తాడు. మరియు వారు ఊహించని విధంగా వారికి ఉపాధిని ప్రసాదిస్తాడు. వారి సమస్యను సులభతరం చేస్తాడు. వారి కార్యాలను శుభప్రదముగా చేసి వారి పాపాలను మన్నిస్తాడు.

ప్రశ్న: ఒక వ్యక్తి ఇహ్రాం ధరించకుండా మక్కాలోకి ప్రవేశిం చాడు. అతను వెళుతున్నది హజ్ కోసం కాదన్న భ్రమలో అధికారులను ఉంచాలన్నది అతని ఉద్దేశ్యం. ఆ తరువాతమక్కాలో ప్రవేశించాక మక్కా నుంచే ఇహ్రాం ధరించి హజ్జ్ చేశాడు. అతని హజ్జ్ సరైనదేనా? దయచేసి జవాబి వ్వగలరు. అల్లాహ్ మీకు మంచి ప్రతిఫలాన్ని అనుగ్రహించుగాక!

జ: అతని హజ్జ్ సరైనదే. కానీ అతని ప్రవర్తన రెండు కారణాల వల్ల అధర్మమైనది. 1) అతను అల్లాహ్ నిర్ణయించిన మీఖాత్ హద్దును ఇహ్రామ్ ధరించకుండా దాటాడు. 2) పాలకులు విధించిన అపరాధము కాని ఒక విధానాన్ని అనుసరించాలన్న అల్లాహ్ ఆదేశం రీత్యా అతను పాలకుల నియమాల్ని అతిక్రమిం చాడు. కాబట్టి అతను తన నిర్వాకంపై పశ్చాత్తాపంచెంది అల్లాహ్‌ను క్షమాబిక్ష కోరాలి. మరియు ఒక జంతువును పరిహారంగా జిబహ్ చేసి మక్కాలోని పెదవారిలో పంచి పెట్టాలి. ఎందుకంటే, అతను మీఖాత్‌ను ఇహ్రాం ధరించకుండానే దాటాడు కాబట్టి.

ప్రశ్న: ఎముకలు ఉడిగిన ఒక వృద్ధుడికి ఇహ్రాం ధరించి కాబతుల్లాహ్ చేరాక ఉమ్రా చేయడం సాధ్య పడలేదు. అతనేమి చేయాలి?

జ: ఉమ్రా చేయటం అతనికి సాధ్యమయినంత వరకు అతను ఇహ్రాం స్థితిలోనే ఉండాలి. ఒకవేళ అతను ఇహ్రామ్ ధరించే టప్పుడు నాకేదైనా అడ్డంకి ఏర్పడితే నేను ఇహ్రాం తీసివేస్తానని సంకల్పం చేసుకొని ఉంటే అలాంటప్పుడు అతను ఇహ్రామ్ తీసేసి హలాల్ అయిపోవచ్చు. అతను ఉమ్రాగానీ, తవాఫె విదా గాని తప్పసరిగా చేయాల్సిన అవసరం లేదు. ఒకవేళ అతను ఇహ్రాం ధరించేటప్పుడు ఎటువంటి షరతు లేకుండా సంకల్పం చేసుకుని, ఆరోగ్యం సహకరించకపోతే అలాంటప్పుడు అతను ఇహ్రామ్ తీసివేసి హలాల్ అయిపోవచ్చు. స్థోమత ఉంటే ఒక జంతువును పరిహారంగా జిబహ్ చేయాలి. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"హజ్జ్-ఉమ్రాలను అల్లాహ్ కొరకు పూర్తి చేయండి. ఒకవేళ మీరు నిలువరంచబడితే మీరు ఇవ్వగలిగిన ఖుర్బానీని ఇచ్చి వేయండి. మీరు ఇచ్చే ఖుర్బానీ ఖుర్బానీ స్థలానికి చేరనంత వరకు శిరోముండనం చేయించుకోకండి".** (అల్ బఖర: 196)

ప్రవక్త ముహమ్మద్ (స) వారికి హుదైబియా ప్రదేశంలో ఉమ్రా చేయనీకుండా మక్కా అవిశ్వాసులు అడ్డుకున్నప్పుడు ఆయన (స) జంతువులను జిబహ్ చేసి ఇహ్రామ్ తీసేశారు.

ప్రశ్న: అప్పులలో ఉన్న వ్యక్తి మీద హజ్జ్ విధి అవుతుందా?

జవాబు: ఆ వ్యక్తి మీద ఉన్న అప్పు అతని ధనం మొత్తానికి సమానమైనదై ఉంటే అతని మీద హజ్జ్ విధి కాదు. ఏలయనగా, అల్లాహ్ స్థోమత గల వ్యక్తి మీద మాత్రమే హజ్జ్ విధిగా చేశాడు. ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది: "అక్కడికి వెళ్ళే స్థోమత గలవారికి ఆ గృహ యాత్ర చేయటాన్ని అల్లాహ్ విధిగా చేశాడు".

(ఆలి ఇమ్రాన్: 97)

అలాంటి వ్యక్తి స్థోమత, సౌకర్యం కలిగాక హజ్జ్ చేయవలెను. ఒకవేళ ఆ వ్యక్తి మీదున్న అప్పు తీరిన తరువాత కూడా ధనం మిగులుంటే అతను అప్పు తీర్చి తర్వాత మిగిలిన డబ్బుతో హజ్జ్ చేసుకోవాలి.

telgo NOVEMBER.indd 22 10/20/11 4:06 PM



భలే మంచి రోజు!

దైవ దాసుల కోసం భలే మంచి రోజు అరఫా. పరమాత్మకు ఎంతో పసందైన రోజు అరఫా. దైవ కారుణ్య వసంతాలు ఎడతెరపి లేకుండా కురిసే రోజు అరఫా. అసత్యం జడుసుకుని, అధర్మం తోక ముడుచుకుని పారిపోయే రోజు అరఫా. దైవ దాసులపై అల్లాహ్ అనంతానంత కృపాకటాక్షాలు కురుస్తూ చూసి షైతాన్ ఓర్వలేక ఇంత మన్ను ఎత్తి తనపై వేసుకుంటూ రోధించే రోజు అరఫా. ఈ రోజు ప్రాస్తశ్యాన్ని తెలియజేస్తూ ప్రవక్త (స) ఇలా ప్రబోధించారు:

"అరఫా రోజును మించి, అల్లాహ్ తన దాసులను నరకాగ్ని నుండి విముక్తి చేయాలని నిర్ణయించుకున్న రోజు మరొకటి లేదు. ఆ రోజు అల్లాహ్ తన దాసులకు అత్యంత చేరువగా ఉంటాడు. వారిని (దుమ్ము సహిత వారి దేహాల్ని) చూసి గర్విస్తూ తన దూతలతో 'నా దాసులు ఏ సదుద్దేశ్యంతో ఇక్కడికి వచ్చారో మీరా?' అని అంటాడు". (ముస్లిం)

మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది: **"షైతాన్, అరఫా రోజు ముఖం మాడ్చుకున్నంతగా, శాపగ్రస్తుడయినంతగా, కోపంతో జుత్తు పీక్కున్నంతగా, బాధతో నెత్తినోరు బాదుకున్నంతగా, అంత హీనంగా, నీచంగా మరేనాడూ కన్పించడు. వాడంత అసహ్యంగా కుళ్ళుకోవడానికి కారణం - కేవలం ఆ రోజు అల్లాహ్ కారుణ్యం అనంతానంతంగా వర్షిస్తూ, మహాపాపాత్ములు సయితం క్షమించబడుతూ వాడికి కనిపించడమే".** (ముఅత్తా ఇమామ్ మాలిక్)

telgo NOVEMBER.indd 23 10/20/11 4:06 PM

telgo NOVEMBER.indd 24 10/20/11 4:06 PM

ఈదుల్ అజ్హా శుభాకాంక్షలు!

best design!!

Thinking about something pleasant

"మారు మనస్సు నిమిత్తము నేను నీళ్లలో బాప్తిస్మము ఇచ్చుచున్నాను; అయితే నా వెనుక వచ్చుచున్న వాడు నాకంటే శక్తిమంతుడు; ఆయన చెప్పులు మోయుటకైనను నేను పాత్రుడను కాను; ఆయన పరిశుద్ధాత్మలోనూ అగ్నిలోనూ మీకు బాప్తిస్మమిచ్చును; ఆయన చేట ఆయన చేతిలో ఉన్నది; ఆయన తన కళ్లమును బాగుగా శుభ్రము చేసి గోధుమలను కొట్టులో పోసి, ఆరని అగ్నితో పాటును కాల్చివేయునని వారితో చెప్పెను". (మత్తయి -3: 11,12)

+ ఈ మాటలను ఎవరు చెప్పారు?
+ ఈ మాటలు ఎవరినుద్దేశించి చెప్పబడ్డాయి?
+ మీకూ తెలుసుకోవాలని ఉందా? అయితే కొంత కాలం వేచి చూడాల్సిందే!